ఇలువేలుపు శ్రీశ్రీశ్రీ వెంకమ్మ పేరంటాలు ఆశీస్సులతో...

శతావధాన భారతి

(సంపూర్ణ శతావధానం)

18, 19, 20 నవంబరు, 2015 - విశాఖపట్నం

‘అవధాన సుధాకర’ ‘అవధాన భారతి’ ‘శతావధాని’

రాంభట్ల పార్వతీశ్వర శర్మ

ప్రసన్నభారతి

సాహిత్య, విద్యా, సాంస్కృతిక సేవాట్రస్టు

47-10-5, ద్వారకానగర్, విశాఖపట్నం - 530 016,

శ్రీ కొండేపూడి సుబ్బారావు

కవిశేఖర శ్రీ కొండేపూడి సుబ్బారావు శతజయంత్యుత్సవాలు 2015

శతావధానం

శ్రీ రాంభట్ల పార్వతీశ్వర శర్మ

వేదిక	:	కళాభారతి ఆడిటోరియం, పిఠాపురంకోలనీ, విశాఖపట్నం -3
అవధాని	:	అవధాన సుధాకర శ్రీ రాంభట్ల పార్వతీశ్వర శర్మ
తేది/సమయం	:	నవంబరు 2015, 18, 19, 20 తేదీలు, ఉ॥ 9.30 గం. నుండి సా॥ 7.30 గం.వరకు
సంచాలకులు	:	శ్రీ కె. కోటారావు (అనకాపల్లి), డా॥ కె. మలయవాసిని (విశాఖపట్నం), డా॥ కోట వేంకటలక్ష్మీ నరసింహం (తణుకు) డా॥ మల్లాప్రగడ శ్రీమన్నారాయణ (విజయవాడ),

అవధాన సుధాకర శ్రీ రాంభట్ల పార్వతీశ్వర శర్మ ప్రథమ శతావధానం ప్రసన్నభారతి ఆధ్వర్యవంలో జయప్రదంగా సంపన్నమైనందుకు సానంద ప్రశంసాభినందనలు

తేది : 21-11-2015

(కె. సర్వేశ్వర ప్రసాద్) , కార్యదర్శి

(పి.వి.కృష్ణయ్య) , అధ్యక్షులు

ప్రసన్నభారతి

సాహిత్య, విద్యా, సాంస్కృతిక సేవాట్రస్టు

47-10-5, ద్వారకానగర్, విశాఖపట్నం - 530 116

శ్రీ రాంభట్ల పార్వతీశ్వర శర్మ

కవిశేఖర కొండేపూడి సుబ్బారావు శతజయంత్యుత్సవాల సందర్భంగా

శతావధానం జయప్రదంగా నిర్వహించిన

అవధాన సుధాకర శ్రీ రాంభట్ల పార్వతీశ్వరశర్మగారికి

ప్రశంసాభినందనలతో 'ప్రసన్నభారతి' సమర్పించు బిరుదము

'అవధాన భారతి'

తేది : 13-12-2015

(కొండేపూడి సర్వేశ్వరప్రసాద్), కార్యదర్శి

(పొన్నపల్లి వేంకట కృష్ణయ్య), అధ్యక్షులు

శతావధానం - ఆరంభశుభ తేది: 18 - 11 - 2015, కళాభారతి భవనం, విశాఖపట్నం

శతావధాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానందభారతీమహాస్వామి వారు

శతావధాన వేదికపై శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి వారి అనుగ్రహభాషణ,
ఆచార్య సార్వభౌమ వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి, శ్రీ ఎస్. విజయకుమార్, శ్రీ కె. కోటారావు,
'అవధాని' శ్రీ రాంభట్లపార్వతీశ్వరశర్మ.

శతావధాన ప్రార్థన

శతావధానం - తేదీ: 18 - 11 - 2015 ఉదయం - సమస్యాంశాల స్వీకరణ

సమస్యల పృచ్ఛకావళి

శతావధానం - తేది: 18 - 11 - 2015 - మొదటి రోజు మధ్యాహ్నం సభ
దత్తపదులు, వర్ణనాంశాల స్వీకరణ

అధ్యక్షులు ఆచార్య పొన్నపల్లి వేంకట కృష్ణయ్య, అవధాని శ్రీ పార్వతీశ్వర శర్మ, సంచాలకులు డా. కోలవెన్ను మలయవాసిని, అవధాని సోదరుడు శ్రీ వేంకటరాయ శర్మ

దత్తపది, వర్ణనాంశాల పృచ్ఛకుల్లో ఓ భాగం

దత్తపది, వర్ణనాంశాల పృచ్ఛకుల్లో మరో భాగం

శతావధానం - తేది: 19 - 11 - 2015 - రెండవరోజు సభ

అధ్యక్షులు శ్రీ బులుసు వేంకటేశ్వర్లు, సంచాలకులు శ్రీ కోటవేంకట లక్ష్మీనరసింహం

శతావధానం - తేది: 20 - 11 - 2015 - మూడవరోజు సభ

అధ్యక్షులు శ్రీ డి.వి. సూర్యారావు, సంచాలకులు శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి

శతావధానం - విజయోత్సవ సభ - తేది: 20 - 11 - 2015 - సాయంత్రం.

అవధాని మాతృమూర్తి సూర్యకాంతకామేశ్వరి గారి సమక్షంలో శతావధాని
పార్వతీశ్వరశర్మ, విశాలస్వాతి దంపతులను
సత్కరిస్తున్న విజయ్‌నిర్మాణ్ సంస్థ అధినేత శ్రీ విజయ్‌కుమార్, శ్రీ సర్వేశ్వరప్రసాద్

పుత్రరత్నం క్షేమేంద్ర సుహాసనందన్‌తో

యువసాహితీవేత్తలతో శతావధాని రాంభట్ల

సంచాలక, పృచ్ఛకవర్గంతో శతావధాని రాంభట్ల, సోదరుడు వేంకటరాయశర్మ

ఆత్మీయులు మాతామహి రాంభట్ల సుబ్బలక్ష్మి,
పిన్ని రాజేశ్వరి గార్ల ఆశీస్సులు అందుకొంటూ

ప్రసన్నభారతి సంస్థ అధినేత
శ్రీ సర్వేశ్వర ప్రసాద్ గారి ఆహ్వానంలో..

అక్క బావగారు శ్రీ నేమాని
ఉషాప్రియ, గిరిధర్ శర్మ
దంపతులు,
విశ్వనాథ సాహిత్యపీఠ
నిర్వాహకులు
శ్రీ పేరాల సీతారామ ప్రభ
గారలతో...

అత్తమామలు
శ్రీమతి & శ్రీ ఉమాకుమారి,
విశ్వనాథం దంపతులు,
సోదరుడు వేంకటరాయశర్మ,
సోదరి ఉషాప్రియ,
కుమారి శ్రుతి

వివిధ పత్రికల్లో

అవధానానికి ప్రపంచ వ్యాప్త ప్రశంసలు

ఆంధ్రజ్యోతి 19.11.2015

ముగిసిన శతావధానం

ఈనాడు 21.11.2015



'Satavadhanam' gets under way

Staff Reporter

VISAKHAPATNAM: Splitting the unique poetry recitation, 'Satavadhanam', into four parts – 'samasya', 'dattapadi', 'varnana', and 'aasuvu', Prasanna Bharathi, a quarterly Telugu literary journal, celebrated the birth centenary of its founder Kondepudi Subba Rao at Kalabharathi auditorium on Thursday.

As a total of 25 'pruchakas' (questioners) started shooting questions, Rambhatla Parvateeswara Sarma, who donned the role of 'Avadhani', recited the poetry with ease.

Some of the pruchakas gave a tough subject such as 'Virat, Sachin, Dhoni, and Warne - describe Ramayana', Mr. Sarma started weaving these words into the poetry while describing a part of the epic.

In between the verses, an 'aprastuta prasangam' (distractor) kept asking irrelevant questions just to deviate the attention of the avadhani.

Irrespective of the distractions, Mr. Sarma was able to weave a poem on any subject given by the questioners, keeping the diction and the summary of the poem alive and meaningful.

Kota Venkata Lakshmi Narasimham, who donned the role of 'sanchalaka' (director), laced the literary treat with a good dose of humour.

"This is the first time that Prasanna Bharathi is organising 'Satavadhani' to mark my father's centenary celebrations. The goal is to strengthen Telugu language, tradition and culture and carry forward the rich literary legacy," said K.S. Prasad, editor of Prasanna Bharathi.

The 'satavadhanam', comprising four categories, concludes on Friday. Each session consists of a set of 25 riddles, constituting to a total of 100 poems. On the concluding day, the avadhani has to recollect and recapitulate all the verses while identifying the right person who gave the riddle.

Rambhatla Parvateeswara Sarma performing the unique Telugu literary event, 'Satavadhanam', in Visakhapatnam on Thursday. — PHOTO: C.V. SUBRAHMANYAM

హిందూ దినపత్రిక 19.11.2015

ఇలువేలుపు శ్రీశ్రీశ్రీ వెంకమ్మ పేరంటాలు ఆశీస్సులతో...

శతావధాన భారతి

(సంపూర్ణ శతావధానం)

18,19,20 - నవంబరు, 2015 - విశాఖపట్నం

'అవధానసుధాకర' 'అవధాన భారతి' 'శతావధాని'

రాంభట్ల పార్వతీశ్వరశర్మ

SATHAVADHANA BHARATI

(Extempore Poems of An Extraodinary Poetic Feat In Telugu)

by

“Avadhana Sudhakara”, “Avadhana Bharati”,
“Avadhana Bheema” “Sathavadhani”

RAMBHATLA PARVATHEESWARA SARMA

శతావధానభారతి
(సంపూర్ణ శతావధానం)

‘అవధానసుధాకర’ ‘అవధానభారతి’ ‘అవధాన భీమ’
‘శతావధాని’ **రాంభట్ల పార్వతీశ్వర శర్మ**

I Edition (ONLINE) : FEB - 2016
ప్రథమముద్రణ: మన్మథనామసంవత్సరం – మాఘమాసం

Online Copy : Indian Rupees 500.
Or
U.S. DOLLORS 10.

For Copies:

R.P. SARMA,
VISAKHAPATNAM, ANDHRAPRADESH
INDIA. CELL: +91 9247859580.
rpsarma9247@mgail.com.
www.facebook.com/rpsarma

All Rights Reserved

అంకితం

కవితకు, పద్యవిద్యకును, కావ్యముఁవ్రాయ, నుపన్యసింపగా,
నవధులు లేనియట్టి మహదాంధ్ర శుభైక వధానవిద్యలో
నవచరితమ్మునందు 'పుట' నాదియునొక్కటియున్ రచింపగా
జవమును గూర్చినట్టి గురుసాంద్రుని గొల్చెద 'పార్వతీశ్వరున్'

'దృశ్యకావ్యధురీణ', 'భాష్యపంచానన'
పితామహులు కీ.శే. శ్రీ రాంభట్ల పార్వతీశ్వరశర్మ గారికి సభక్తికంగా ...

'మనుమడు'
పార్వతీశ్వర శర్మ

అనుక్రమణిక

1. ఆశీర్వాద శ్రీముఖము 05
– 'జగద్గురు' శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామివారు.
2. కృతజ్ఞతలు 06
– రాంభట్ల పార్వతీశ్వర శర్మ శతావధాని
3. శతావధాన నివేదిక 09
– ప్రసన్న భారతి
4. చి॥ రాంభట్ల పార్వతీశ్వరశర్మకు ఆశీర్వచనము 11
– 'సరస్వతీపుత్ర' బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ
5. ఆనంద మకరందం 12
– 'అపూర్వ పంచసహస్రావధానసార్వభౌమ' డా. మేడసాని మోహన్
6. పద్యమ్ము నెవడురా 14
– 'గురు సహస్రావధాని' డా. కడిమిళ్ళ వరప్రసాద్
7. 'అవధాన భారతి'కి అభినందన మందారం 18
– 'ఆచార్యసార్వభౌమ' డా. వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి
8. శుభాశీస్సులు 21
– 'అభినవ భారతి' డా. కోలవెన్ను మలయవాసిని
9. అభినందన 24
– 'అవధానరాజహంస' శ్రీ కోట వేంకట లక్ష్మీనరసింహం
10. సమానానా ముత్తమ శ్లోకోస్తు 26
– 'మధురభారతి' శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి
11. సహృదయామోదం 29
– 'సాహితీ రత్నాకర' డా. డి.వి. సూర్యారావు
12. భారతీ కృప 31
– 'కవివతంస' శ్రీ బులుసు వేంకటేశ్వర్లు
13. సంపూర్ణశతావధానం 32
– శ్రీ. కె. కోటారావు
14. అక్షరాశీః 36
– 'సంగీత నవావధాని' డా. మీగడ రామలింగస్వామి
15. అవధాన సుధాకరుని శతావధాన శరచ్చంద్రికలు 38
– 'భారతీభూషణ' శ్రీ రాంభట్ల నృసింహశర్మ
16. శతావధాన పద్యపూరణలు (సమస్య, దత్తపది, వర్ణన, ఆశువులు) 42
17. Neuro Psycho'logical' basis of Sathaavadhanam 78
– Dr. P.V.S.R. Bharath Kumar
18. ప్రశంస 81
– ఆచార్య పొన్నపల్లి వేంకట కృష్ణయ్య
19. అంతరంగం 82
– శ్రీ రాంభట్ల వేంకటరాయశర్మ

Sri Mouna swamy

SRI SIDDHESWARI PEETAM

Mounaswamy Mutt, Courtallam (T.N.)-627802

Sri Siddheswarananda

Peetadhipati : *Paramahamsa Parivrajakacharya, Jagadguru,*

SRI SIDDHESWARANANDA BHARATI SWAMY

కార్తీక పూర్ణిమ

Date : 25.11.2015

శ్రీ [illegible] నమః

చి॥ రాంభట్ల పార్వతీశ్వరశర్మ చేసిన శతావధాన[illegible]
[illegible], శ్రీ [illegible]
[illegible]
సంతోషిస్తున్నాను. [illegible]
[illegible]
[illegible]
[illegible] ఆశిస్తున్నాను. [illegible]
ఒక [illegible] మాత్రమే. [illegible]
[illegible]
[illegible]

[illegible]!

[illegible]
సిద్ధేశ్వరానంద భారతీ స్వామి

కృతజ్ఞతలు

"జన్మనిచ్చిన తలిదండ్రి సహజగురువు
లక్షరాభ్యాసమొనరించు నాదిగురువు
జీవితంబున నభివృద్ధిఁ జెందునట్లు
బోధజేసెడు నాతడు పూజ్యగురువు"

ఇలువేలుపు **శ్రీశ్రీశ్రీ వెంకమ్మపేరంటాలు**, కులదైవం **శ్రీవేంకటేశ్వరుడు**.. **'రాంభట్ల'** కుటుంబంలో మా తలపుల్లో ఎప్పుడూ కొలువుదీరి, తలచుకున్నంత మాత్రాన సత్సంకల్పాన్నిచ్చి, అండగా అన్నింటా నిండి ఆ సంకల్పాన్ని నెరవేర్చే వేలుపు పెద్దలు. గోత్రార్జితమైన ఈ సూత్రాన్ని తెలియజేసిన జననీజనకులు **సూర్యకాంతకామేశ్వరి**, స్వర్గీయ **లక్ష్మీనరసింహ సోమయాజుల** చరణారవిందాలకు నమస్సుమాంజలులు. పద్యవిద్యాభ్యాసానికి పరమోత్కృష్ట మార్గదర్శకత్వం వహించి, అవధానిగా నాకొక స్థానాన్ని కల్పించిన పితామహులు కీ.శే. **శ్రీ పార్వతీశ్వర శర్మ** గారికి నమోవాకాలు.

ఆకాశవాణి, దూరదర్శన్‌లు వారానికో, పక్షానికో వచ్చే 'సమస్యాపూరణం' కార్యక్రమం నా పద్యరచనకు పునాది. విజయనగరం జిల్లా శృంగవరపుకోటలో మాతామహి కీ.శే. **రాంభట్ల సత్యవతమ్మ** గారి ప్రోద్బలంతో పితామహులు 'దహరానందనాథ' దీక్షానామధేయులు – స్వర్గీయ **శ్రీ వేంకట సోమయాజులు** గారి సారథ్యంలో, కుటుంబ సభ్యుల సహకారంతో 2005వ సంవత్సరంలో ప్రథమ అష్టావధానాన్ని నిర్వహించాను. విశాఖలోను, మిగిలినప్రాంతాల్లోనూ ఆత్మీయుల ప్రోత్సాహంతోనూ అవకాశం దొరికినప్పుడల్లా అష్టావధానాలు చేస్తూ వచ్చాను. ఈ నా ఉన్నతికి కారణమైనవారిలో 'ఆచార్య సార్వభౌమ' **వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి**గారు, 'అభినవభారతి' శ్రీమతి **కోలవెన్ను మలయవాసిని** గారు, కీ.శే. అష్టావధాని 'పండిత' **నేమాని రామజోగి సన్యాసిరావు**గారు నాకు చిరస్మరణీయులు.

విశాఖపట్నంలో ప్రముఖసాహితీవేత్తగా, పత్రికాసంపాదకులుగా ఇంకా విభిన్నరంగాల్లో నిష్ణాతులుగా పేరొందిన వారు కీ.శే. 'కవిశేఖర' **కొండేపూడి సుబ్బారావు** గారు. వారి వాత్సల్యం చూరగొన్న శిష్యకోటిలో నేనూ ఒకణ్ణి. పద్యరచన పోటీల్లో, కవిసమ్మేళనాల్లో వారి మార్గదర్శకత్వం మరపురానిది. ఆ మహనీయుని శతజయంతిని పురస్కరించుకుని వారి సుపుత్రుడు శ్రీ **సర్వేశ్వరప్రసాద్**గారు వర్ధిష్ణువునైన నాచే శతావధానం నిర్వహింపజేయడం 'ప్రసన్నభారతీ' కృపగా

భావిస్తున్నాను. అవధానరంగంలో అడుగిడిన నాటి నుండి ఈ శతావధానం వరకు కూడా వెన్నుదన్నుగా నిలిచిన ఆచార్య పొన్నపల్లి వేంకట కృష్ణయ్యగారికి, ఇంకా ఈ శతావధాన నిర్వహణలో పాలుపంచుకున్న అందరికీ పేరు పేరునా నా కృతజ్ఞతలు.

2004వ సంవత్సరంలో విశాఖపట్నం శ్రీ లలితాపీఠంలో శ్రీ కడిమిళ్ళ వరప్రసాదకవి, శ్రీ కోట లక్ష్మీనరసింహకవి జంటగా శతావధానం చేశారు. అప్పుడు నేను 'ఇంటర్మీడియట్' చదువుతున్నప్పటికీ పద్యకవిని కావడంతో పీఠం మేనేజర్ **శ్రీ వాడరేవు సుబ్బారావు** (ప్రస్తుతం శ్రీశ్రీశ్రీ లలితానందభారతీస్వామి) గారి అనుమతితో దత్తపది పృచ్ఛకుడిగా పాల్గొనే అవకాశం కలిగింది. నేను, అన్నయ్య వేంకటరాయశర్మ మరికొంతమంది కుటుంబసభ్యులు కూడా ఈ జంటకవుల శతావధానంలో పృచ్ఛకులమయ్యాం. సాహితీ విరాట్ స్వరూపానికి ప్రతీక పరమహంస పరివ్రాజకాచార్య **శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీమహాస్వామి** వారి దర్శనభాగ్యం ఆనాడు నాకు కలిగింది.

సాహితీమహేంద్రజాలానికి ఆటపట్టయిన 'అవధానసరస్వతి' 'కవికులపతి' శ్రీస్వామివారి పాదపద్మాలను పద్యపుష్పాలతో అర్చించిన సందర్భాలెన్నో – ధార, ధారణలను పటిష్టం చేసి ప్రజ్ఞాప్రభాసాలుగా నన్నావహించాయి. కవిసమ్మేళనాల్లో, సాహిత్య, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనే అవకాశాన్ని పీఠనిర్వాహకులు కల్పిస్తూవచ్చారు. క్రమంగా అవధానరంగంలో అభ్యున్నతి సాధిస్తూండడంతో **శ్రీ లలితా పరమభట్టారిక** కృపతో పీఠప్రాంగణంలో నాలుగుసార్లు అష్టావధానాలు చేసే అవకాశం దక్కింది. సాహిత్యరూపకాల్లో పాత్రధారణలు, ప్రసంగాలు, సభావ్యాఖ్యానాలు ఇలా విభిన్నాంశాల్లో అవకాశాన్నిచ్చి చేయూతనివ్వడమేకాక, మా ప్రపితామహుల పేరుమీదుగా నడిపిస్తున్న **'డా. రాంభట్ల వేంకటరావు మెమోరియల్ ట్రస్ట్'** ద్వారా సాహిత్యకార్యక్రమాలు నిర్వహించుకొనే వేదికగా శ్రీలలితాపీఠం 'రాంభట్ల' కుటుంబసభ్యులకు మాననీయమైంది. అవధానరంగంలో అడుగిడి అభివృద్ధిపథంలో నడకలు నేర్చుకొంటున్నప్పుడు విశాఖసాహితి – శ్రీ లలితాపీఠం సంయుక్తంగా నన్ను '**అవధాన సుధాకరు**'డిని చేసి ప్రోత్సహించాయి.

ఈ తొలిశతావధానానికి 'జగద్గురువులు' విచ్చేసి, శుభారంభం చేసి అనుగ్రహించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. ఈ శతావధాన కార్యక్రమంలో పాల్గొన్న అధ్యక్షులకు, సంచాలకవరేణ్యులకు, పృచ్ఛకులకు, విశాఖ ప్రముఖులకు, ఇతర ప్రాంతాలనుండి విచ్చేసి ఈ శతావధానాన్ని జయప్రదం చేసిన కవులు, పండితులు, సాహితీవేత్తలు, విద్యార్థులు, భాషాభిమానులు, కుటుంబసభ్యులకు నా ధన్యవాదాలు.

శిష్యవాత్సల్యంలో ఈ గ్రంథానికై ఆశీ:పూర్వక అభిప్రాయాలను అందించిన అవధాన దిగ్గజాలు 'గగనధునీ వేగ సమ ఆశు కవితా నిర్మాణ దక్షులు' శ్రీ **'మేడసాని'** వారికి, మూర్తిభవించిన సరస్వతీ తేజం శ్రీ **'మాడుగుల'** వారికి, **'గరికిపాటి'** శుభాన్వయ కీర్తికేతనానికి **'కడిమిళ్ళ'** విద్వద్కవి సాంద్రునకు, 'అవధాన మానససరోవర రాజహంస' శ్రీ **కోట** వారికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు.

మొదటినుండి అష్టావధానాల్లో చేయూతనిస్తూ, ఇప్పుడు ఈ శతావధాన పద్య పూరణాల సమీక్షావ్యాసాన్ని అందించిన 'భారతీభూషణ' **రాంభట్ల నృసింహశర్మ** (పినతండ్రి) గారికి ప్రత్యేకాభివాదాలు. ఈ శతావధానంలో అద్వితీయమైన ప్రోత్సాహాన్నందిస్తూ, ధైర్యాన్ని, ఆత్మస్థైర్యాన్ని సమకూరుస్తూ ప్రథమప్రయత్నంలో విజయపథంలో ప్రయాణించడానికి అనుకూలమైన దృక్పథాన్ని సూచించిన మార్గదర్శకుడు అన్నయ్య **వేంకటరాయ శర్మ**కు హృదయపూర్వక శతాధిక నమస్కారాలు. అంతే ప్రోత్సాహాన్నందిస్తూ అధ్యయన, అభ్యాసాల్లో చేదోడు వాదోడుగా నిలిచిన అర్థాంగి చి॥ సౌ॥ **విశాలస్వాతి**కి, నా అభినందనలు. సుపుత్రుడు చిరంజీవి **'క్షేమేంద్ర సుహాస నందనుడి**కి' ఆశీస్సులు. ఈ శతావధానం సంపూర్తికి ఆత్మీయంగా సహకరించిన అత్త, మామలు చామర్తి **ఉమాకుమారి, విశ్వనాథశర్మ** దంపతులకు, అక్క, బావగారు నేమాని **ఉషాప్రియదర్శిని, గిరిధర్** దంపతులకు నా అభివాదాలు.

సాహితీక్రతువైన శతావధాననిర్వహణ ఒక ఎత్తైతే, ఆ పద్యపూరణల్ని, విశేషాల్ని పుస్తకరూపంలో సాహితీలోకానికి అందుబాటులోకి తీసుకురావడం మరో ఎత్తు. ఒకటి నిర్వహించింది **"ప్రసన్నభారతి"** అయితే – మరొకటి సాకారమవడానికి హార్దికంగా, ఆర్థికంగా ప్రసన్నమైన భారతి – జగద్గురు **"శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతి"**.

ఈ **'శతావధానభారతి'**ని ప్రచురించడానికి కూడా చేయూతనిచ్చిన విశాఖ **శ్రీలలితాపీఠానికి**, ధర్మాధికారి **శ్రీశ్రీశ్రీ లలితానందభారతీ స్వామి** వారికి ప్రణతులు.

"అరయ నష్టావధానమ్ము లాచరింప
చేరి కవికులమందున పేరుపొంద,
సాహితీరూపకముల, ప్రసంగములను
బ్రోచె; శ్రీలలితాపీఠమును నుతింతు!"

విద్వజ్జనవిధేయుడు

రాంభట్ల పార్వతీశ్వరశర్మ శతావధాని

విశాఖపట్నం

శతావధాన నివేదిక

'కవిశేఖర' కొండేపూడి సుబ్బారావుగారి శతజయంతి ఉత్సవాలు 2015 నవంబరు 18 నుండి 22 వరకు విశాఖపట్నంలో ప్రసన్నభారతి సంస్థ ఆధ్వర్యంలో విజయవంతంగా జరిగాయి. ఇందులో మొదటి మూడురోజులు అవధానసుధాకర శ్రీ రాంభట్ల పార్వతీశ్వరశర్మ శతావధానం నిర్వహించారు. వేదిక విశాఖపట్నం, మద్దిలపాలెంలోని కళాభారతి భవనం.

18-11-2015 ఉదయం ప్రారంభసభ. ఈ సభకు ఆచార్య సార్వభౌమ వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి అధ్యక్షులుగాను, కుర్తాళం శంకరాచార్య, విశాఖ శ్రీ లలితా పీఠాధిపతి పరమహంస పరివ్రాజకాచార్య, జగద్గురు శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి వారు ముఖ్యఅతిథిగాను, విశాఖపట్నంలోని విజయ్‌నిర్మాణ్ సంస్థ అధిపతి డా॥ సూరపనేని విజయకుమార్ గౌరవ అతిథిగాను పాల్గొన్నారు. స్వామివారి ఆశీ:పూర్వక అనుగ్రహభాషణంతో శతావధానానికి శుభారంభం కలిగింది. అనంతరం డా॥ కె.కోటారావు (అనకాపల్లి) సంచాలకత్వంలో చి॥ పార్వతీశ్వర శర్మ శతావధానం ప్రారంభించి 25మంది పృచ్ఛకులనుండి సమస్యలను స్వీకరించి పూరణాల్లో మొదటి పాదాలు చెప్పారు. మరొక ముగ్గురు ప్రముఖులడిగిన విషయాలపై ఆశువుగా పూర్తి పద్యాలు చెప్పారు. ఆనాటి సాయంకాలం సభకు ఆచార్య పి.వి. కృష్ణయ్య అధ్యక్షులు, ఆచార్య కోలవెన్ను మలయవాసిని సంచాలకులుకాగా ఆ సభలో 25 మంది పృచ్ఛకుల నుండి దత్తపదులు, మరొక 25 మంది నుండి వర్ణనాంశాలు స్వీకరించి మొదటి పాదాలు చెప్పారు అవధాని. అంతేకాక ప్రేక్షకుల్లో ప్రముఖులడిగిన అంశాలపై 7 పద్యాలు ఆశువుగా చెప్పారు కూడా. ఈనాటి అవధానసభలో శ్రీమంగు శివరామప్రసాద్ గారు అప్రస్తుతప్రసంగం నిర్వహించి ప్రేక్షకులను అలరించారు.

19-11-2015న ఉదయం, సాయంత్రం జరిగిన రెండు సభలకు 'కవివతంస' శ్రీ బులుసు వేంకటేశ్వర్లుగారు అధ్యక్షులు, సహస్రావధాని, 'అవధాన రాజహంస' శ్రీ కోటవేంకటలక్ష్మీనరసింహం గారు సంచాలకులు. ఈ సభలలో అవధాని సమస్య, దత్తపది, వర్ణనలకు సంబంధించిన 75 అంశాలకు రెండవపాదాలను రమ్యంగా పూరించారు. 10 మంది ప్రేక్షకులడిగిన విషయాలపై ఆశువుగా పద్యాలు చెప్పారుకూడా. ఈ సభలకు శ్రీ రాంభట్ల నృసింహశర్మ, శ్రీ నందూరి ప్రభాకర్, అప్రస్తుతప్రసంగం నిర్వహించి సభలను రంజింపచేసారు.

20-11-2015న జరిగిన సభలకు డా॥ డి.వి. సూర్యారావు అధ్యక్షత, మధురభారతి ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణగారు సంచాలకత్వం నిర్వహించగా అవధాని మొత్తం 75 అంశాల పద్యాలను పూర్తిచేయడమేకాక మరొక 5 పద్యాలు ఆశువుగా చెప్పి పృచ్ఛకుల ఆమోదాన్ని, ప్రేక్షకుల ప్రశంసలని అందుకున్నారు. ఈనాటి సభలలో శ్రీ ఎం.ఎస్.వి. ప్రసాద్, శ్రీ వేదుల సుబ్రహ్మణ్యశర్మ, శ్రీమతి కె.ఎస్.వి. రమణమ్మ, అప్రస్తుతప్రసంగం చేసి సభలను రక్తి కట్టించారు. లభ్యమైన సమయాన్ని బట్టి ధారణ నిర్వహించిన అనంతరం విజయోత్సవసభలో డా॥ విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని అవధాని దంపతులను, సంచాలకులను, పృచ్ఛకులను ఘనంగా సన్మానించారు. ఈ విధంగా తొలి మూడు రోజులలో తన తొలి శతావధానాన్ని సుసంపన్నం కావించారు. ఈ శతావధానంతో శతజయంత్యుత్సవాలకు సారస్వత వైభవోపేతమైన ప్రారంభం మంగళప్రదంగా జరిగింది.

ఈ శతావధానంలో శ్రీపార్వతీశ్వరశర్మ చెప్పిన పద్యాలు ఆయన పాండిత్యానికి, పద్యనిర్మాణ నైపుణ్యానికి, భావగాంభీర్యానికి, చమత్కారానికి మచ్చుతునకలుగా భాసించి సభాసదులైన రసజ్ఞుల ప్రశంసలందుకున్నాయి. ఈ విధంగా ప్రప్రథమ శతావధానంలోనే అవధాని శ్రీ రాంభట్ల పార్వతీశ్వర శర్మ చూపిన ప్రతిభావైదుష్యాలకు విశాఖవాసులంతా ఆనందంలో తేలియాడారు.

– ప్రసన్నభారతి

2015 నవంబరు 18, 19, 20 తేదీలలో శతావధానం నిర్వహించిన

శ్రీ రాంభట్ల పార్వతీశ్వరశర్మ కు ప్రసన్నభారతి సంస్థ

"అవధాన భారతి"

బిరుదు ప్రదానం చేసినది.

ఈ సందర్భంగా ప్రసన్నభారతి అధ్యక్షులు చదివిన పద్యం

సుకవిరాజు కొండేపూడి సుబ్బరావు
శతజయంతి సందర్భాన శతవధాన
మొనరుప, 'ప్రసన్నభారతి' తనివి చెంది
ప్రీతి 'అవధానభారతి' బిరుదమొసగె
నీకు పార్వతీశ్వరశర్మ! నెమ్మి గొనుమ!



అవధాన సరస్వతీ పీఠం
అవధాన సహస్రఫణి - బృహత్ ద్విసహస్రావధాని
బ్రహ్మశ్రీ డా. మాడుగుల నాగఫణి శర్మ M.A.Ph.D.
నెం. 42, శారదాబాద్, ఎస్.ఎ.సి. (ఫ్లైఓవర్) రోడ్డు, మాదాపూర్, హైదరాబాద్ - 500 084, ఆంధ్రప్రదేశ్, ఇండియా
Ph: 040- 2311 6277, 2311 6499, Cell: 9989773849, 9849744556

చి॥ రాంభట్ల పార్వతీశ్వరశర్మకు ఆశీర్వచనము

ఉ॥ నీదు శతావధానమున నిండిన పద్యములెల్ల చూచి ప్ర
హ్లాదనమందినాను; విషయమ్మును- చెప్పిన తీరు- శబ్దసం
పాదన- శైలి- ధార- ప్రతిభామయమై వెలిగొందె; నింకనున్
సాధనతో సమగ్రమగు సాహితిలోన సమర్థుడౌనవన్!

కం॥ **'అవధాన సుధాకరు'** డవు
వివిధ ప్రజ్ఞావిశేష విద్యామతివై
'అవధానభారతీ' కృప
నవరస భావార్ద్ర కావ్యనవ్యతఁగనుమా!

మ॥ అవధానంబన నొక్క కావ్యకవితావ్యాసంగమే కాదు, స
ద్వివిధప్రజ్ఞల మేలవింపు, కవి బృందేద్యంబునాధ్యంబునౌ
నవనిన్ నీవటువంటి భవ్యపదవీవ్యావర్తివై వెల్గ, మె
చ్చి వచింతున్ కవి'పార్వతీశ్వర'! శుభాశీర్వాదమందించెదన్!!

అవధాన సరస్వతీపీఠ నిలయమైన మహాసరస్వతీకృపాకటాక్ష సిద్ధిరస్తు

ఆశీః

'సరస్వతీపుత్ర'
బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ

సరస్వతీపుత్ర; కవితాగంగోత్రి
అపూర్వ పంచసహస్రావధాన సార్వభౌమ
డా. మేడసాని మోహన్

ఆనంద మకరందం

ఆత్మీయులు, ప్రతిభామూర్తి శ్రీరాంభట్లపార్వతీశ్వర శర్మగారి శతావధాన పద్యాలు చదువుతూ ఉంటే ఆనందమకరందరసాస్వాదనం చేసినట్లనిపించింది. ధారా శుద్ధి, ప్రసన్నత, మంచి ఊహలపోహళింపు, సద్య:స్ఫురణ - ఇత్యాదిగా అవధానప్రతిభామూర్తికుండదగిన లక్షణాలన్నీ ఈ కవికి పుంజీభూతంగా, రక్తనిష్ఠమై ఉన్నాయి. 'సచిన్, ధోని, విరాట్ వార్న్' - వంటి పదాలతో భారతార్థంలో పద్యం అల్లడంలోగాని, 'కన్నముబెట్టువానిననఘా యని పిల్చిన సార్థకంబగున్' వంటి సమస్యలను సముచితంగా పరిష్కరించడంలోగానీ ఈ ప్రతిభామూర్తి సమయస్ఫూర్తిని చూస్తే అవధాన సరస్వతిని ప్రసన్నం చేసుకున్న తపస్వియే - అనే భావన నాలో కలిగింది.

నేను స్వయంగా శర్మగారి ఈ శతావధానం చూడలేదు కాబట్టి వీరి ధారణ గురించి వ్రాయడం ఔచిత్యంకాదేమో! అయితే ఒక అంశాన్నిమాత్రం స్పష్టీకరింపగలను. అవధాని పద్యంలో ప్రతిపాదించే ఏ భావాన్నైనా త్రికరణశుద్ధిగా తన భావుకతాశక్తితో అనుభవించి చెప్పినపుడు అటువంటిపద్యం హృదయంలో స్థిరంగా ఉంటుంది. శర్మగారు ఈ శతావధానంలో పూరించిన సమస్యలు, దత్తపదులు, వర్ణనలన్నింటిలోనూ ఈ లక్షణం ప్రస్ఫుటంగా ఉంది. అందువల్ల సముచితమైన కార్యకారణ సంబంధాన్నిబట్టి శర్మగారి ధారణకూడా అమోఘంగా ఉంటుంది.

శ్రీ రాంభట్లపార్వతీశ్వరశర్మగారు అవధానరంగంలో ఇంకా ఇంకా పురోగమించి సహస్రావధానాదులుకూడా నిర్వహింపగలరని ఆకాంక్షిస్తున్నాను. సరస్వతీదేవి అనుగ్రహం, ఆశీస్సులు వారికండగా ఎల్లవేళలా భాసిస్తూ ఉంటాయి.

“ పద్యారంభములందు నెత్తుగడనుద్భాసించు అందాలు; రం
గద్యుక్తిన్ సుమనోహరంబయిన ముక్తాయింపులెన్నన్ భళీ!
హృద్యంబౌ అవధానవిద్య పదిలంబెంతేని నీబుద్ధి, వి
ద్వద్యోధాగ్రణి! పార్వతీశ్వరకవీంద్రా! నిన్ ప్రశంసించెదన్! ”

భద్రం తే
మేడసాని మోహన్
14.12.15.

'గురుసహస్రావధాని'

డా. కడిమిళ్ళ వరప్రసాద్

తెలుగు భాషాపండితులు, నరసాపురం, పశ్చిమగోదావరి జిల్లా.
సెల్: 9247879606.

పద్యమ్ము నెవడురా

తిరుపతి వేంకట కవులనుండి ఈనాటివరకూ అవిచ్ఛిన్నంగా సాగిపోతూనే ఉంది అవధాన ప్రక్రియ. ఈమధ్య చాలమంది తెలుగుభాష అంతరించిపోతోంది, అదృశ్యమైపోయేలా ఉంది, దానికి పునరుజ్జీవం కలిగించండి అంటూ గొంతు చించుకొంటున్నారు. తెలుగుభాష బ్రతకాలంటే ఒకటే మార్గం. అవధానాలు పుంఖానుపుంఖాలుగా సాగాలి. ఆ అవధానాలవలన ప్రజలకు పద్యంపై మమకారం పుడుతుంది. పద్యంవలన తెలుగుభాషపై మమకారం పుడుతుంది. క్రమంగా తెలుగు కావ్యాలు ప్రబంధాలు చదవాలనో, అవి చదివినవారి చేసే ప్రసంగాలు వినాలనో ఆసక్తి కలుగుతుంది. అలా ప్రజలలో భాషపై మక్కువ పుట్టిస్తే భాష శాశ్వతంగా నిలబడుతుంది కాని, అప్పుడప్పుడు ఏవో మహాసభలు పెట్టి లక్షలు ఖర్చుపెట్టి, తెలుగుభాష గొప్పతనం గురించి అదే పనిగా ఉపన్యాసాలు చెప్పించేస్తే భాష బ్రతుకదు. ఓరియంటల్ కళాశాలలను పునరుద్ధరించాలి. తెలుగు చదివితే జీవనోపాధికి ఢోకాలేదనే విశ్వాసాన్ని యువతరానికి కలిగించాలి. ప్రతి ప్రాథమిక పాఠశాలలోను తప్పనిసరిగా ఒక తెలుగు పండిట్ ఉద్యోగం ఏర్పాటు చేయాలి. అప్పుడు తెలుగుపండితుల అవసరం దేశానికి బాగా పెరుగుతుంది. అందువలన తెలుగు చదువుకోవడానికి ఎక్కువమంది ఆసక్తిని చూపిస్తారు. అడ్డదారిలో తెలుగు ఎమ్.ఎ చదివి తెలుగుపండితులుగా మారిపోవడం కాదు, కచ్చితంగా ఓరియంటల్ కళాశాలలో చదివినవారినే తెలుగుపండితులుగా నియమించే విధానాన్ని ప్రభుత్వం పాటించిననాడు అసలైన, నిర్దుష్టమైన తెలుగు చిన్నతనంనుండే పిల్లలకు అలవాటు చేసే అవకాశం కలుగుతుంది. ప్రాచ్యకళాశాలలకు పురావైభవం వస్తుంది.

ఒకప్రక్క తెలుగు అంతరించిపోతోందనే ఆవేదన వ్యక్తమవుతూనే ఉంది. మఱొక ప్రక్క పద్యకావ్యాలు, ఖండకావ్యాలు, శతకాలు పుంఖానుపుంఖాలుగా వస్తూనే

ఉన్నాయి. తెలుగునాట పద్యకవులకు కొదువ లేదనడానికి ఆకాశవాణిలో దశాబ్దాల తరబడి అవిచ్ఛిన్నంగా సాగుతున్న సరసవినోదిని (సమస్యాపూరణ) కార్యక్రమమే నిలువెత్తు నిదర్శనం. ఇది ఇలా ఉండగా ప్రశాంతంగా ఇంట్లో కూర్చుని తనకు తోచిన భావాలను పద్యంలో పెట్టడమే కాదు, ఎవరు ఏమడిగినా ఆ భావాన్ని పద్యంలో అప్పటికప్పుడు ఆశువుగా చెప్పగలిగే శక్తిని సంపాదించుకొని దానిని ప్రదర్శనగా చేయడమే అవధానం. అదీ ఒక పద్ధతిలో సాఫీగా సాగనివ్వకుండగా ఎనిమిది రకాలుగా అవధానిని ఇబ్బంది పెడుతున్నా తట్టుకొని రసవంతమైన పద్యాలను ప్రాశ్నికులు అడిగిన విధంగా ఆశువుగా చెప్పి తిరిగి అప్పజెప్పగలగడమే అష్టావధానం. ఆ సంఖ్యను వందకు పెంచితే శతావధానం. వెయ్యికి పెంచితే సహస్రావధానం. ఇటువంటి అవధానాలవలన ఎటువంటి భావాన్నైనా పద్యంలో పొదగవచ్చు. యతిగణప్రాసలు భావాన్ని పొదిగేందుకు అడ్డురావు, తగిన సామర్థ్యం సంపాదించుకొంటే.

ఎందరో ఎన్నో నాటకాలు వ్రాసారు. కాని తిరుపతి వేంకటకవుల పాండవోద్యోగ, విజయాల నాటకాలకు వచ్చినంత ప్రజాదరణ మఱే నాటకానికీ రాలేదు. దానికి కారణం వారు అవధానులు కావడమే. ఏ సన్ని వేశంలో ఏ పద్యం ఎలా చెపితే ప్రజాదరణ పొందుతుందో అవధానులకు తెలిసినట్లుగా మరెవరికీ తెలియదు. ఈవిధంగా తెలుగుభాషకు నిజమైన సేవ అవధానులవల్లనే జరుగుతుందన్నది పదహారణాల సత్యం.

తెలుగునాట పద్యకవులకు లోటు లేనట్లే అవధానులకుకూడా లోటు లేదు, ఉండదుకూడ. ఈనాడు యువలోకంలో అవధానవిద్యపై మమకారం పెరుగుతోంది. పద్యం ఆశువుగా చెప్పే అలవాటు వచ్చాక తదుపరి గమ్యం అవధానమే అవుతోంది. అటువంటి యువ అవధానులలో ఆయుష్మంతుడు శ్రీ రాంభట్ల పార్వతీశ్వరశర్మ అవధానరంగంలో అడుగుపెట్టి, అంతకంతకు ఎదుగుతూ శతావధాని కావడం ఎంతో ఆనందంగా ఉంది.

శర్మతో నాకు పూర్వంనుండి పరిచయం ఉంది. అతని పద్యం చెప్పేతీరు, అందులో ధారాశుద్ధి నాకు తెలుసు. కాకపోతే 2015 నవంబరులో విశాఖ కళాభారతి మందిరంలో జరిగిన శతావధానమైతే స్వయంగావీక్షించే అవకాశాన్ని నేను పొందలేక

పోయాను. అవధాన ప్రధాన నిర్వాహకులు స్వయంగా నన్ను దూరవాణిద్వారా ఆహ్వానించారు. కాని అది నవంబరు నెల కావడం చేతను, శతావధానం జరిగే మూడురోజులూ పనిదినాలే కావడం చేతను, ప్రభుత్వ ఉపాధ్యాయునిగా ఉన్ననాకు సెలవులు లేకపోవడం చేతను హాజరుకాలేకపోయాను. అయినా నాయందలి గౌరవంతో శర్మ మొత్తం శతావధానం పద్యాలు నాకు 'ఇ-మెయిల్' ద్వారా పంపించాడు. ఆ రకంగా పద్యాలు చూసే అవకాశం లభించి ఆనందించాను.

అవధానం, అందునా శతావధానం చేయాలంటే వంద పద్యాలు - వచ్చిన పదబంధాలు రాకుండా చెప్పగలగాలి. ప్రాశ్నికులు అడిగినట్లుగా చెప్పగలగాలి. ధారాశుద్ధి ఉండాలి. అపశబ్దాలు పడకూడదు. ఛందస్సు తప్పకూడదు. అంతో ఇంతో ఆలంకారికత ఉండాలి. ఔచిత్యాన్ని పాటించాలి. రసవంతంగా ఉండాలి. చివరికి ధారణ చేయాలి. ఎవరైనా శబ్దచర్చకు దిగితే సమర్థంగా సమాధానం చెప్పాలి. ఇన్ని సమకూరితే పండితులను ఒప్పించవచ్చు. దానితోబాటు సరస సంభాషణాశైలితో అప్రస్తుత ప్రశ్నలను త్రిప్పికొడుతుంటేనే సామాన్యులను మెప్పించగలరు. ఆయీ లక్షణాలన్నీ ఒకచోట చేరాలంటే సరస్వతి అనుగ్రహం ఎవరియందు ప్రసరిస్తుందో అటువంటివారు మాత్రమే అవధానాలు చేయగలరు. ఆ రంగంలో లబ్ధప్రతిష్ఠులు కాగలరు. అటువంటివారి కోవలోకే పార్వతీశ్వరశర్మ చేరుతున్నాడని ఈ పద్యాలు చూడగానే నాకు అర్థమయింది. 'బాంబులు' అనే పదాన్ని 'కదంబాంబులు' (కదంబ అంబులు- మేఘాలనుండి స్రవించే నీళ్లు-వాన) అని మార్చాలంటే సద్యస్ఫురణ, శబ్దజ్ఞానం ఉంటేనే సాధ్యమవుతుంది. 'ప్రవరుడు వరూథినిని చేపట్టాడు' అనగానే మాయా ప్రవరుడు అని మనుచరిత్ర చదివినవారందరికీ తెలుస్తుంది. కాని 'మాయా' అన్న పదం చంపకమాలలో ఇమడదు. అదే అవధానికి సమస్య. వెంటనే మాయ అనే అర్థంలో 'శాంబరీ' శబ్దాన్ని ప్రయోగించాలనే ఆలోచన కలిగిందంటే ఆ అవధాని అవధానలోకంలో సుస్థిర స్థానం సంపాదించుకొన్నట్లే.

అలాగే దత్తపదుల విషయానికి వస్తే అవి సమస్యలకంటె ఎక్కువగా కంఠం పట్టుకొంటాయి. ఒక్క విరుపు దొరికితే చాలు సమస్య పని పూర్తయినట్లే. కాని దత్తపదులకు నాలుగు విరుపులో లేక సమన్వయాలో కావాలి. అందులోనూ కొందరు

ప్రాశ్నికులు అత్యుత్సాహంతో అర్థం లేని పదాలు, పరభాషా పదాలు ఇచ్చి అవధానిని ఎంత బాధ పెట్టాలో అంతా పెడతారు. వాటిని తట్టుకోవాలి. అందులోకూడా మనవాడి ప్రతిభ బయట పడింది. "సరి, గమ, పద, నిస" అనే పదాలు ఇస్తే... 'గోకులవాస రిపుల్' అంటూ 'సరి'ని సాధించారు. 'కనగ మహాత్ములు' అని 'గమ'ను సాధించారు. 'ఆపద' అంటూ 'పద' పని పట్టేసారు. 'హాని సలుప' అని 'నిస'ను లొంగదీసికొన్నారు. ఈ ఒక్క పద్యం చాలు మన శర్మకు ఇంక అవధానంలో ఢోకా లేదని ఢంకా బజాయించి చెప్పడానికి.

ఏతావతా నా చెప్పేదేమంటే యువతరంలో ఇటువంటి అవధానులు తయారవుతున్నారంటే తెలుగు భాషకుగాని, పద్యానికిగాని ఎటువంటి ఇబ్బంది లేదు. మూడు పూవులు ఆరు కాయలుగా ముందు తరాలవారిని తెలుగు మరిన్ని వెలుగులను సంతరించుకొని అలరిస్తుంది అలవోకగా. ఎవరో ఎప్పుడో అన్నారు పద్యాన్ని పాతిపెట్టండి, అది పాతబడిపోయిందని. ఆ భావన ఎంత వెఱ్ఱితనమో ఇటువంటి యువ అవధానులను చూస్తే తెలుస్తోంది. అలా అన్నవారికి ఆనాడే నేనిచ్చిన సమాధానం మఱొక్కమారు గుర్తు చేసికొంటున్నాను.

సీ॥ పద్యమ్మునెవడురా పాతిపెట్టెదనంచు
ఉన్మాదియై ప్రేలుచున్నవాడు
పద్యమ్ము నెవడురా ప్రాతవడ్డదియంచు
వెఱ్ఱివాడై విఱ్ఱవీగువాడు
పద్యమ్ము ఫలమురా పాతిపెట్టిన పెద్ద
వృక్షమై పండ్ల వేవేల నొసగు
పద్యమ్మునెప్పుడో పాతిపెట్టితిమేము
లోకుల హృదయాల లోతులందు
తే.గీ॥ ఇప్పుడద్దాని పెకలింప నెవరితరము
వెలికి తీసి పాతుట యెంత వెఱ్ఱితనము
నిన్నటికి మున్ను మొన్ననే కన్నుదెఱచు
బాల్యచాపల్యమునకెంత వదరుతనము॥

* * *

ఆచార్య సార్వభౌమ
ప్రొ॥ వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి
M.A. Ph.D. (Telugu), M.A. Ph.D. (Sanskrit)
Retired Professor & Former Head of the Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.

శారదాపీఠం,
46-15-35, దొండపర్తి,
విశాఖపట్నం-530016.
ఫోన్ : 0891-2541003
సెల్ : 9490084217

‘అవధాన భారతి’కి అభినందన మందారం

ఆంధ్రసాహిత్యచరిత్రలో పద్యవిభాగానికి చెందిన అవధానప్రక్రియ అత్యంత విశిష్టమైనది. ఆ ప్రక్రియలోని మాధుర్యాన్ని జనబాహుళ్యానికి రుచిచూపిన ఘనత తిరుపతివేంకటకవులకి, కొప్పరపు కవులకీ దక్కుతుంది. దాని సర్వతోముఖవికాసానికి డా॥ మేడసాని మోహన్, డా॥ మాడుగులనాగఫణి శర్మ, డా॥ గరికిపాటి నరసింహారావు, కడిమిళ్ళ, కోట ప్రభృతులు పోషిస్తున్న పాత్ర పరమశ్లాఘ్యం. చి॥ సౌ॥ బులుసు అపర్ణ, చి॥ ఫుల్లాభట్ల శాంతిస్వరూప కలిసి జంట కవయిత్రులుగా అవధానాన్ని జనరంజకంగా నిర్వహించడంవల్ల ఆ ప్రక్రియకి ఎంతో వన్నె చేకూరుతోంది.

కోస్తాజిల్లాలుగా పరిగణింపబడుతున్న విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం అనే ప్రాంతాలలో శతావధానం చేసినవారు మృగ్యులు. పరిశోధనవల్ల లభిస్తారేమో? చి॥ వర్ధిష్ణువు రాంభట్ల పార్వతీశ్వరశర్మ ఆ ఘనతకి అర్హతని సంపాదించుకోడం ఆత్మీయమైన అస్మదాదులకు పరమహర్షదాయకం.

ఆబాల్యం పద్యరచన చేస్తూ ఉద్యోగజీవితంనుండి విశ్రాంతినొందిన పిమ్మట వివిధప్రక్రియలలో విశిష్టమైన గ్రంథరచన చేస్తూ ‘కవిశేఖరులు’గా ఆంధ్రరాష్ట్రంలోనూ వివిధరాష్ట్రాలలోనూ బహువిధపురస్కారాలు గ్రహించిన కవిలోక చూడామణి కీ.శే. కొండేపూడి సుబ్బారావుగారు. ఉత్తమ సంస్కార సంపన్నులైన వారి పుత్రరత్నం చి॥ కొండేపూడి సర్వేశ్వర ప్రసాద్ తండ్రిగారి శతజయంతిసభలు నిర్వహించడానికి పూనుకుని చి॥ రాంభట్ల పార్వతీశ్వరశర్మని ప్రోత్సహిస్తూ శతావధానాన్ని సర్వసుందరంగా సుమనోమనోరంజకంగా నిర్వహించడం అత్యంత ప్రశంసార్హం.

చిరంజీవి రాంభట్ల పార్వతీశ్వరశర్మ తొమ్మిదవ తరగతి చదువుతున్నప్పటి నుండి సభలలో వివిధాంశాలపై ఆశువుగ పద్యాలు చెప్తూ సహృదయుల ప్రశంసలు అందుకొన్న బాలకవి. క్రమంగా కృషిసలిపి ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఎం.ఏ తెలుగు

అధ్యయనం చేసి ఉత్తమశ్రేణిలో సముత్తీర్ణుడై పద్యరచనలో కూడా పురోగతిని సాధిస్తున్న నిత్యసాహిత్య వ్యవసాయకృషీవలుడు.

వివిధ సభలలో అష్టావధానాలని విజయవంతంగా నిర్వహించి నేడు విశాఖ మహానగరంలో శతావధానాన్ని కూడా శ్రోతృజనశ్రవ:పేయంగా విద్వజ్జనశ్లాఘ్యంగా నిర్వహించడం ఉత్తరాంధ్ర సాహిత్యప్రియులకు గర్వకారణం. శతావధానంలో పద్యాలు అలవోకగా ఆవిష్కరింపబడ్డాయి. భావాలు కల్పనాసనాథాలు. పదముల విరుపులు పరమరమణీయాలు. హృదయంగమాలు.

సమస్యలలో **'రాతికి మ్రొక్కువారికి నిరంతర సౌఖ్యము లభ్యమయ్యెడిన్'** అని ఒకరు ఈయగా **'రావణారాతికి'** అని అవధాని సమర్థిస్తూ పూరించినాడు. పెద్దన సజీవపాత్రచిత్రణకి ప్రతీకగా నిలిచినట్టివాడు, జితేంద్రియత్వానికి లోకంలో కూడా పోలికగా చెప్పబడే వాడు అయిన ప్రవరుడు **"వరూథినిని పట్టి సుఖించె హిమాలయంబునన్"** అని ఈయబడిన సమస్యని అవధాని **'శాంబరీప్రవరుడు'** అని సమర్థించడం ముదావహంగా ఉన్నది. అలాగే **"చరణంబులులేని వాడు చకచక నడిచెన్"** అనే సమస్యని అవధాని **"దుష్కర్మాచరణంబులు లేనివాడు"** అని పూరించినాడు. **"పదములు లేకుండ కవిత వ్రాయగవచ్చున్"** అన్న సమస్యని అలవోకగా **"స్వర్భాషాపదములు లేకుండ"** అని గావించిన సమర్థనం ఆమోదయోగ్యమైనదే. **"భర్త యల్లుడయ్యె భార్యకిపుడు"** అనే సమస్యని శ్రీరాముని పరంగా పూరిస్తూ **'భూభర్త'** అని పేర్కోడంకూడా రమణీయమైన పూరణం. **"మగలుబరువుకాదె మగువలకును"** అనే సమస్యని **'టీ.వీ'** చూడడంపరంగా అవధాని పూరించడంలోని కల్పన అత్యంత సహజంగా అనుభవసిద్ధంగా ఉన్నది. అభినందింపదగ్గది.

దత్తపదులలో **"సరి, గమ, పద, నిస"** అనే అక్షరాల జంటని భారతపరంగా ప్రయోగింపమని కోరగా **"గోకులవాసరిపుల్"**, **"కనగమహాత్ములు"**, **"ఆపద"**, **"హానిసలుప"** అనే పదాలలో ఇమిడ్చినరీతి చమత్కారావహంగా ఉన్నది. **"సచిన్, ధోని, విరాట్, వార్న్"** అనే పదాలను భారతార్థంలో ప్రయోగించాలన్నప్పుడు **"వ్యాస చిన్మయ"**, **"విరాట్స్వరూప"**, **"అధోనిధులు"**, **"వేదవార్నిధి"** అని గావించిన పద్యరచన హృద్యమైనది. **"పాలు, పెరుగు, వెన్న, నేయి"** అనే పదాలతో మధ్యతరగతి కష్టాలని

నిరూపిస్తూ అవధాని **"శాపాలు", "పెరుగదల", "పోవెన్నడు", "తీర్చునే యిక్కటులను"** అని పదముల విరుపులో చక్కగా ఆ పదాలని అమర్చినరీతి ప్రతిభాసమంచితం.

వర్ణనలలో **"ఆధునికపంచభూతాలైన 'లాప్‌టాప్' లాంటివి లేకపోతే యువత మానసికస్థితి", "ప్రసన్న భారతిపత్రికను చిరంజీవి కొండేపూడి ప్రసాద్ నడిపిస్తున్న తీరును చూస్తే కీ.శే. సుబ్బారావుగారికి కలిగే పుత్రోత్సాహం", "హుద్-హుద్ తుఫాను తర్వాత కోలుకున్న విశాఖనగరం", "కవిశేఖరకొండేపూడి సుబ్బారావుగారి సాహితీ విరాట్ స్వరూపం"** మున్నగు అంశాల్ని వర్ణించడం కూడా చి॥ అవధాని అద్భుతమైన ప్రజ్ఞని ప్రదర్శించినాడు. **"పాఠశాలలో ప్రస్తుతం తెలుగుబోధన"** అనే అంశం వర్ణిస్తూ చెప్పినపద్యం తెలుగుబోధనయొక్క దైన్యస్థితిని కళ్ళకుకట్టినట్లు నిరూపిస్తోంది.

తమ పితృపాదులైన 'కవిశేఖర' కొండేపూడి సుబ్బారావుగారి శత జయంత్యుత్సవ సందర్భంగా శతావధానకార్యక్రమాన్ని ఏర్పాటుచేసి చి॥ రాంభట్ల పార్వతీశ్వరశర్మకి ఆ అవకాశాన్ని కల్పించిన పితృభక్తిపరాయణుడు చి॥ కొండేపూడి సర్వేశ్వరప్రసాద్‌ని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. వర్ధిష్ణుడు చిరంజీవి రాంభట్ల పార్వతీశ్వరశర్మ ఇతోధికంగా అమేయమైన ప్రతిభని అనల్పకల్పనావైభవాన్ని అసదృశప్రాబంధిక శయ్యావిన్యాసాన్ని ప్రదర్శిస్తూ ఎన్నో అవధానాలతో చిరకాలం వర్ధిల్లాలని హృదయదఘ్నమైన వాత్సల్యంతో ఆశీర్వదిస్తున్నాను.

"శ్రీరాంభట్లకులాంభోధేః అవధాని సుధాకరమ్
పార్వతీశ్వరశర్మాణం పాయాద్వాణీ నిరంతరమ్"

శుభం భూయాత్

ఇట్లు,
విద్వజ్జన విధేయుడు
వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి
6-12-15.

'అభినవ భారతి'

డా. కోలవెన్ను మలయవాసిని, M.A. Ph.D. (Telugu)

Retired Professor & Former Head of the Dept. of Telugu,
Andhra University, Visakhapatnam. Ph. 0891 - 2530289.

శుభాశీస్సులు

అవధానం - పద్యనాటకం - ఆంధ్రులకీర్తికిరీటంలో కలికితురాయిలు. ఈ రెండు ప్రక్రియలు పద్యపునాదిమీద లేచే మహాసౌధాలు. ప్రస్తుతం ప్రపంచదేశాల్లో అవధానవిద్య ఆంధ్రదేశంలోనే ప్రకాశిస్తూ భాషాప్రియులకు ఆనందాన్ని కలుగజేస్తోంది. వివిధరకాలయిన అవధానాలున్నా పద్యప్రధానాలయిన అష్టావధాన, శతావధాన, సహస్రావధానాల ప్రత్యేకత విశేషమైనది.

ఈ మధ్యకాలంలో చిరంజీవి రాంభట్లపార్వతీశ్వరశర్మ ఎం.ఏ., విశాఖ కళాభారతిలో శ్రీయుతులు కొండేపూడి సుబ్బారావుగారి శతజయంతి సందర్భంలో 'ప్రసన్నభారతి' నిర్వహించిన కార్యక్రమంలో శతావధానం విజయవంతంగా చేసారు.

చిరంజీవి పార్వతీశ్వరశర్మ వర్ధిష్ణువు. ఇప్పటికే పలు అష్టావధానాలు చేసి అనుభవం గడించి శతావధానానికి సన్నద్ధుడై భేషుగ్గా పూర్తిచేసాడు. మూడురోజులు జరిగిన ఈ శతావధానంలో మొదటిరోజు ఉదయం - పాతికసమస్యలు, మధ్యాహ్నం - పాతికదత్తపదులు, పాతికవర్ణనలు స్వీకరించి - ఒక్కొక్క పాదం మనోజవంతో మారుతతుల్యవేగంతో పృచ్ఛకులకు అందించారు. రెండోరోజు రెండోపాదాలు, మూడోరోజు మూడునాలుగుపాదాలు పూర్తిచేసి విజయుడయ్యాడు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో యువ అవధానిగా పేరుతెచ్చుకున్నాడు. అసలు ఉత్తరాంధ్ర - హరికథకు పెట్టిందిపేరు. హరికథ అనగానే సాక్షాత్కరించేది హరికథాపితామహులు శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసుగారే. ఈప్రాంతంలో అవధానాన్ని అర్చించిన ప్రముఖుల్లో కూడా ఆదిభట్ల వారు ముందుండడం విశేషం.

డా॥ అయ్యలసోమయాజుల గోపాలరావుగారు తమ 'వ్యాస మంజూష' లో 'అసాధ్య అష్టావధాని ఆదిభట్ల' అనే వ్యాసంలో అందించిన వివరాలు ఇక్కడ స్మరించుకోవడం ఔచిత్యం.

ఒకటి – "బరంపురంనుండి పలాసాకువస్తూ ఆ ప్రాంతంలోని కామేశం పంతులు గారితో కలిసి ప్రయాణం చేస్తూ ఇద్దరూ కలిసి చెరో యాభై పద్యాలు ఆశువుగా చెప్పారుట. అంటే చెరో అర్థశతావధానమన్నమాట. విశేషమేమిటంటే ఎవరిపద్యం వారే కాకుండా ప్రతిపద్యంలో సరిపాదాలొకరు బేసి పాదాలు మరొకరు ఇలా పూర్తిచేసారట".

మరొకటి – "దాసుగారు విజయనగరంలోని ముదుంబై నరసింహాచార్యులు గారితో కలిసి సహస్రావధానం చేసారని దాసుగారి శిష్యుల్లో ప్రముఖులు శ్రీ పేరి నరసింహశాస్త్రిగారు చెప్తున్నారు. (వీరిప్పుడు విజయనగరంలోనే ఉన్నారు) ఈ రెండు వాక్యాలవల్ల శ్రీ దాసుగారు శతావధాన, సహస్రావధానాలు చేసేవారని తెలియవస్తోంది.

చిరంజీవి పార్వతీశ్వరశర్మ శ్రీదాసుగాని ఆశీస్సులతో సహస్రావధాని కూడా కావాలని ఆకాంక్ష. ఇక ఈ అవధానంలో శర్మ – సమస్యలన్నీ సమర్థవంతంగా పూరించాడు. ఉదాహరణకు –

"చరణంబులులేని వాడు చకచకనడిచెన్" అనే సమస్యను **'దుష్కర్మాచరణంబులు...'** అంటూ పూరించి మెప్పించాడు. దత్తపదులలో – 'స్వార్థంలో ప్రయోగించకూడదు' అనే నియమం పెట్టని చోటుల్లో కూడా సాధ్యమయినంతవరకు వేరే అర్థంలో ప్రయోగించి తన ప్రతిభను ప్రదర్శించాడు. శ్రీ పూడిపెద్ది కృష్ణకిరణ్‌శర్మ గారు ఇచ్చిన – **'సరి,గమ,పద,నిస'** అనే దత్తపదిని భారతార్థంలో పూరించిన విధానం శర్మ పదనిర్మాణశక్తిని ప్రకటిస్తున్నది.

కం॥ "గోకులవాస! రిపుల్గల
రే కనగ ? మహాత్ములుండిరీ కురుభూమిన్!!
నీకగు నాపదదీర్చుట,
నాకగునే హానిసలుప? నారాయణుడా!"

ఇక వర్ణనల విషయంలో ఈ అవధాని సామాన్య వృత్తాలతోపాటుగా – విశేషవృత్తాలను స్వీకరించడం మెచ్చదగిన అంశం. సుగంధి, మంగళమహాశ్రీ, వసంత తిలకం, స్రగ్విణి, వనమయూరం, తరలం, మత్తకోకిల, ఉత్సాహ వంటివి ఈ అవధానంలో వినబడిన ఛందోవిశేషాలు.

ఈ అవధానంలో –

పద్యపూరణ సమయంలో అవధాని గళంనుండి వెలువడిన వాక్యాలు – సత్యసమ్మతాలేకాక అవధానికి కూడా అన్వర్థం కావడం విశేషం. **"తిరుమలేశ్వర! శ్రీశ! నుతింతు నిన్ను, దత్తపదియందు పృచ్ఛక చిత్తమలర"** పృచ్ఛకుల చిత్తమలర దత్తపదుల పూరణ జరిగింది.

తే.గీ॥ "ఈ 'కళాభారతిన్' పద్యమే తపస్సు
మాకిట 'ప్రసన్నభారతి' మార్గమయ్యె
పద్యహారతిబట్టగ పండితాళి
విజయసారథినయ్యెద వినయమొప్ప!!"

అవధానరథాన్ని విజయసారథియై నడిపించిన శ్రీ పార్వతీశ్వరశర్మకు శుభాభినందనలందజేస్తూ – త్వరలో సహస్రావధాన రథానికి సారథికావాలని ఆశీస్తూ..

మలయవాసిని
17.01.2016

'అవధాన రాజహంస' 'సహస్రావధాని'
కోట వేంకట లక్ష్మీనరసింహం
తెలుగు భాషా పండితులు (రి)
తణుకు,
పశ్చిమగోదావరి జిల్లా.
సెల్ : 9247193417.

అభినందన

తెలుగుభాషకు తలమానికమైన అవధానం-ప్రపంచాన్ని అబ్బురపరుస్తోంది. ఈ అవధాన సాహితీవిన్యాసంతో పండిత పామరకోటిని రంజింపచేసిన చేస్తున్న వారు భారతీదేవి ముద్దుబిడ్డలుగా ప్రశంసలు పొందుతున్నారు. ఇటీవలి కాలంలో అవధానరంగంలో మా పార్వతీశ్వరశర్మ అడుగుపెట్టి, నడక నేర్చి, ఆటగా అవధానాలు చేస్తూ.. ఇప్పుడు పద్యాలపరుగుల శతకాన్ని సాధించి అందరి మన్ననలూ పొందిన సంగతికి నేను ప్రత్యక్ష సాక్షిని.

అవధానికి ప్రధానంగా కావలసినది పద్యరచనా ధోరణి. అది సమృద్ధిగా ఉన్నది ఈ అవధానికి. రెండవది ధార. అది పుష్కలంగా ఉన్నది. ఇక ధైర్యం. వర్ణనాది పద్యాలనిర్మాణంలో, క్లిష్టప్రాసలతో ఉన్న సమస్యల పూరణలో, దత్తపదుల నిర్వహణలో ఈ ధైర్యం కొట్టవచ్చినట్లు కనబడింది. స్ఫురణకు, చమత్కార సంభాషణలకు లోటే లేదు. ధారణకు మాంచి ప్రయత్నంచేసి కృతార్థుడయ్యాడు మా పార్వతీశం.

ఈ నా మాటలకు ఎన్నెన్నో ఉదాహరణలు మీకు వెదకనవసరం లేకుండా దర్శనమిస్తాయి. దత్తపది 7వ పద్యం, 20వ పద్యం గమనించండి. సమస్యలు 4, 22 తిలకించండి. **"పదములు లేకుండ కవిత వ్రాయగవచ్చున్"** ఇదీ సమస్య. పూరణ చూడండి. **"సదమల వాణీ... స్వర్భాషా"** వరకూ ఒకటే సమాసం. ఆశ్చర్యం.

అంతవరకూ అవి స్వర్భాషాపదాలే. అవి లేకుండా కవిత వ్రాయవచ్చు. ఇదీ పూరణావిధానం. పులకించండి. ఇలా ఎన్ని చెప్పాలి? శతమునకు శతమూ చెప్పాలి. అమ్మ భారతి అద్భుతమైన పాండిత్యంగల అవధానిని అవనికి అందించింది.

భావిలో ఎన్నెన్నో అవధానాలు, శాశ్వతంగా నిలిచి ఉండే కావ్యాలు, మన యువశతావధానిద్వారా సృజింపబడాలని, ఖండఖండాంతర ఖ్యాతి మా పార్వతీశానికి కలగాలని కోరుతూ నా అభినందనలను అందజేస్తున్నాను.

మ॥ వరమై, సుందరమై, సుభావయుతమై, వర్ధిల్లి నీ హృద్యమౌ
సరసానంద సుబోధకాన్విత వచస్సామగ్రి వేయింతలై
ధరలో పండితులెల్ల మెచ్చుకొనగా! ధన్యమ్ముగా పార్వతీ
శ్వర శర్మా! భవదీయ సత్కృతులు విశ్వమ్మందు వ్యాపించుతన్!!

సహృదయ విధేయుడు
కోట వేంకట లక్ష్మీ నరసింహం
02. 02. 2016.

'ఆర్షవిద్యాసాగర' 'మధురభారతి'
మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి
సత్యనారాయణపురం, విజయవాడ – 520011.
సెల్: 8106196418.

సమానానా ముత్తమ శ్లోకోఽస్తు

సారస్వతప్రపంచాన్ని పరిశీలిస్తే, అవధానాలకు మళ్ళీ మంచిరోజులు వచ్చాయనిపిస్తోంది. తెలుగునేల నాలుగు చెరగులా తిరుగులేని విఖ్యాతిని సముపార్జించుకొన్న అవధానం ఈ తరాన్ని మళ్ళీ ఉఱ్ఱూతలూగిస్తోంది. యువతరం నుంచి ఉత్సాహవంతులైన ఎందరో అవధానులు రంగం మీదకి వస్తున్నారు. అలా వస్తున్నవారిలో శ్రీరాంభట్ల పార్వతీశ్వరశర్మ ఒకరు. అవధానరంగంలో అడుగుపెట్టి అనతికాలంలోనే అభిజ్ఞుల మన్ననలందుకొంటూ పురోగమించిన ఈ 'అవధాన సుధాకరుడు' విశాఖలో తన తొలి శతావధానం విజయవంతంగా నిర్వహించటం సాహితీప్రియులకి ఆనందం కలిగించింది. శ్రీ పార్వతీశ్వర శర్మ తొలి శతావధానంలో ప్రదర్శించిన ప్రతిభాపాండిత్యాలకు ప్రత్యక్షసాక్షిని నేను.

అడిగిన వెంటనే ఆశువులు అందంగా చెప్తూ, అప్రస్తుతాలను అడ్డుకుంటూ, చెదరని ఆత్మవిశ్వాసంతో సమస్యలను, దత్తపదులను, వర్ణనలను పూరించిన తీరు చూడగా ఉజ్జ్వల భవితవ్యం ఈ యువశతావధానికోసం ఎదురుచూస్తోందనిపిస్తోంది.

ఈ శతావధానంలో ఇతడు ఎదుర్కొన్న మొదటి సమస్య – **"రాతికి మ్రొక్కువారికి నిరంతర సౌఖ్యము లభ్యమయ్యెడిన్"** అని. వినీవినగానే ఇది ప్రసిద్ధమైన పాత సమస్యేనని దీనికి పూరణం ఏమంత కష్టం కాదని అనిపిస్తుంది మనకు. ఎందుకంటే "మురారాతికి మ్రొక్కు వారికి..." అని "పురారాతికి మ్రొక్కువారికి..." అని తేలికగా విరుపు సాధించవచ్చు. కాని ఈ అవధాని 'రావణారాతికి' అని కొత్త విరుపును ఎన్నుకున్నాడు. ఉగ్రవాదమే తగినదనే అర్థం వచ్చే సమస్యను – పూరిస్తూ, విశ్వశాంతిని కూల్చడానికి ఈ కాలంలో ఉగ్రవాదమే యుక్తమై ఉందని చెప్పి, తనకుగల సామాజిక అవగాహనను నిరూపించుకున్నాడు. ఇది కేవలం ఒక అక్షరం విడదీసి,

ఒక అక్షరం కలిపి పరిష్కరించగల సమస్యకాదని గుర్తించిన అవధాని ప్రతిభ ప్రశంసార్హం. "బాంబులు బంగరుపంటలు పండిస్తా"యనే సమస్యకు – "మేఘ సత్కదంబాంబులు" అనే పూరణ విన్నప్పుడు అవధాన సభలో హర్షధ్వానాలు మిన్నుముట్టాయి. "కవిత కనరాదు తిక్కన కవితలోన" అనేది 'ఆర్థిక' సమస్య అని పసిగట్టిన అవధాని – వ్యాకరణ పరిజ్ఞానం ఆధారంగా పూరించిన వైఖరి పార్వతీశ్వరకవి పాండిత్యానికి ఒక మచ్చుతునక.

"చరణంబులు లేనివాడు చకచక నడిచెన్" అన్న సమస్యకు **"దుష్కర్మా చరణంబులు"** అన్న పూరణ అందించారు కవి. సమస్యతో పాటు సందేశశంఖంకూడా పూరించిన కవి భావౌన్నత్యం మెచ్చదగినది. **"కొట్టుకొని పోవు గాలికి కొండలెల్ల"** అనే సమస్యను పూరించడానికి గోవర్ధనోద్ధరణ సన్నివేశాన్ని ఎన్నుకుని "ఎంతగాలికైనా కొండలు కొట్టుకొనిపోవు" అనే అర్థంలో పూరించిన తీరు అవధాని ఔచిత్యాన్ని తెలియచేస్తోంది. పురాణగాథనే ఈ పూరణకు నేపథ్యంగా ఎంచుకున్న కవి, పురాణగాథ ఆధారంగా సమస్య ఎదురైతే, ఏం చేస్తాడు అనిపిస్తుంది మనకు. **"పడదు మత్స్యయంత్రము నాడు ఫల్గుణునకు"** అనేది అలాంటి సమస్య. మత్స్యయంత్రం కొట్టగలిగిన అర్జునుడికి – ఆ విజయానికి అంది వచ్చిన సామగ్రీ సంభారాలను (దైవము, గురువు, అన్న అనుగ్రహించడం) ప్రస్తావించడంలో కవికిగల సమయస్ఫూర్తి వెల్లడవుతోంది. **"కామిని పాదనూపురము ఖంగునమ్రోగదు హేతువేమొకో"** అనేది ఒక సమస్య. ఆ నూపురానికి మువ్వలు లేవని తేలిగ్గా పరిష్కరించగల సమస్యయిది. అంత 'నీరసం'గా చెప్తే కవి 'శృంగారి' ఎలా అవుతాడు? ఈ సమస్యను పూరించడానికి– కవితాసరోవరాన్ని కల్పించిన అవధానిగారి భావుకతను అభినందించకుండా ఉండగలమా?

దత్తపదులపూరణలో ఈ కవి తనకున్న శబ్దపరిజ్ఞానాన్ని చక్కగా వినియోగించు కున్నాడనిపిస్తుంది. **"పాలు, పెరుగు, వెన్న, నేయి"** పదాలతో 'మధ్యతరగతి ప్రజలజీవనం' వర్ణించమంటే – నిజానికి తేలిక. 'ఇవేవీ మధ్యతరగతి ప్రజలకు

అందుబాటులోలేవు" అనే అర్థం వచ్చేలా చెప్తే సరిపోతుంది. కాని, ప్రతిభావంతుడైన కవికి – 'శాపాలు', 'పెరుగుదల' స్ఫురించాయి. 'వెన్న, నేయి' కూడా వేషం మార్చుకుని పద్యంలో ఒదిగిపోయిన తీరు "ఔరా" అనిపిస్తుంది. **'కట్టు, బొట్టు, జుట్టు, పట్టు'** పదాలతో ఆధునికమహిళను వర్ణించినపుడు "ప్రతిభ యనునది నిత్యనూత్నము" అన్న కవితోక్తి మనమదిలో మెదలకమానదు.

"వర్ణనానిపుణః కవిః" అన్నారు లాక్షణికులు. అయితే అవధానికి, కవికి తేడా ఉంది. కవి తనకు నచ్చిన తాను ఎన్నుకున్న వర్ణనలు చేస్తాడు. కాని అవధాని – పృచ్ఛకులడిగిన అంశాన్ని ఆశువుగా వర్ణించాలి. శ్రీ పార్వతీశ్వరశర్మ వర్ణణాంశాలను నిర్వహించిన వైనం అతడి బహుముఖ ప్రతిభకు, కుశాగ్రధిషణకు, భావుకతకు సామాజిక స్పృహకు తార్కాణంగా కనిపిస్తుంది. 'ప్రసన్నభారతి' పురోగతిని చూసి తండ్రికి కలిగిన పుత్రోత్సాహాన్ని 'మంగళమహాశ్రీ' వృత్తంలో సహజసుందరంగా వ్యక్తం చేసిన విధానం, సింహాద్రి అప్పన్న చందనోత్సవం 'కర్ణపిశాచి' అయిన 'సెల్ ఫోన్', 'విద్యుద్దీపకాంతులలో విశాఖ సాగరతీరం' – ఇలా వైవిధ్యంతో కూడిన ఎన్నో అంశాలను వర్ణించిన పద్యాలు ధార, శయ్య కలిగి, భావనాబలంతో, పదాలపొందికతో సాగాయి.

ముందుముందు ఈ అవధాని మరింత రాణించగలడని, అఖండవిజయాలను ఆర్జించగలడని ఈ శతావధానం నిరూపించింది. సాధించినదానితో సంతృప్తి పొందక గురుశుశ్రూషతో **'లోకశాస్త్రకావ్యాద్యవేక్షణం'** సాగించి ప్రతిభకు పదునుపెట్టుకుంటూ ధార, ధారణ, ధోరణులను పెంపొందించుకుంటూ ధైర్యంగా ముందుకు సాగి, ఈ తరం అవధానుల్లో అగ్రశ్రేణిలో నిలువగలడని ఆశీస్తూ, ఆశీర్వదిస్తున్నాను.

సమానానా ముత్తమ శ్లోకోఽస్తు

"రాంభట్ల పార్వతీశ్వర
అంభోజాసనుని రాణి నర్చింపగ నా
రంభించిన సుకృతీ! యిక
జృంభింపుము – వాణి నీకు శ్రేయములొసగున్!!"

* * *

'సాహితీ రత్నాకర'
డా. డి.వి. సూర్యారావు
తెలుగు అధ్యాపకులు (రి), విశాఖపట్నం.
సెల్: 9885188431.

సహృదయామోదం

ఒక సాహిత్యప్రక్రియ వందలసంవత్సరాలుగా ఒక భాషలో మహోన్నతంగా నిలిచి ఉండడం అరుదైన విశేషం. ఆ విశేషమే తెలుగుభాషకు సంబంధించిన అవధానప్రక్రియ. కవిత్వాన్ని ప్రదర్శనాత్మమైన కళగా సాహిత్యరంగలో అవధానప్రక్రియ తీర్చిదిద్దింది. అవధానవిద్య తెలుగువారి సంపద. ఘంటికాశతగ్రంథకల్పనులు, శతలేఖినీ పద్యసంధానధౌరేయులు, ఘడియకు నూరుపద్యములు ఘంటములేక రచించుకవులూ చాలామంది ప్రాచీనతెలుగు సాహిత్యంలో మనకు కనిపిస్తారు. అవధానం బహువిద్యల సమోపేతమైన విద్య.

ప్రప్రథమంగా అష్టావధాన శతావధాన విధానాన్ని రూపుదిద్ది సంస్కృత ఆంధ్రాలలో ప్రదర్శించిన అవధానపితామహుడు శ్రీమాన్ మాడభూషి వేంకటాచార్యుల వారి నుండి నేటివరకు ఎందరో మహానుభావులు అద్భుతంగా అవధానాలు నిర్వహించి అవధానాన్ని ఒక సాహిత్యప్రక్రియగా నిలబెట్టారు.

పద్యానికి కాలం చెల్లిపోయిందనే వారున్నారు. నేటితరం తెలుగులో మాట్లాడడం లేదని బాధపడుతున్నవారున్నారు. అయినా అవధానం నిలిచే ఉంది. యువతీయువకులు ఈ ప్రక్రియలో కృషి చేస్తూ అవధానులుగా రాణిస్తున్నారు.

అవధానవిద్యకు మరో ఆశాకిరణం శ్రీ రాంభట్ల పార్వతీశ్వర శర్మ. 36 అష్టావధానాలు చేసి ఇటీవల శతావధానం విజయవంతంగా, సహృదయ ఆహ్లాదకరంగా నిర్వహించారు. ప్రాయం మూడుపదులలోపే (26) అయినా, ఈ చిన్న వయసులోనే శతావధానం చేయడం, ఇప్పటికే విద్వజ్జన సమక్షంలో 'అవధానసుధాకర' బిరుదును పొందడం ముదావహం.

శతావధానంలో చి|| రాంభట్ల సమస్యలను వినూత్నకల్పలనతో, సమయోచిత ప్రజ్ఞతో, చమత్కారావహంగా పూరించారు. **'కవిత కనరాదు తిక్కన కవితలోన'** అన్న సమస్యను వ్యాకరణ పరిభాషను ఆశ్రయించి కారకపరిచ్ఛేదసూత్రపరంగా పూరించడం గొప్ప చాతుర్యం. **'సానికైదును పదిజేసి సాగిలిదురు'** క్లిష్టమైన సమస్యగా కనిపిస్తుంది. 'పల్కుల దొరసానికి' అని ప్రయోగించి పూరించడం చక్కనైన ఊహ. **'నీరు దప్పి తీర్చ నేర దాయె'** అనే సమస్యను 'రైతునకుబుకు కన్నీరు' అని భావించి పూరించడం బాగుంది. కొన్ని సమస్యలు పాతవైనా నూతనకల్పనలతో పూరించి తన సృజన, ప్రతిభను చాటుకున్నారు అవధాని. **"సచిన్, ధోని, విరాట్, వార్న్"** వంటి పదాలతో పద్యంలో భారతార్థాన్ని స్ఫురింపజేయడం, పద్యంలో ఇమిడించడానికి ఇబ్బంది కలిగించే **"సుత్తివేలు, రాళ్ళపల్లి, బాబుమోహన్, బ్రహ్మానందం"** అనే పేర్లను దత్తపదిగా ఇవ్వగా ఆ పేర్లను ఉపయోగించి కన్యాదాత మనస్థితిని వర్ణించడం అవధాని ప్రజ్ఞకు గీటురాయి.

వర్ణనల్లోనూ పంచచామరం, మంగళమహాశ్రీ, వసంత తిలకం, స్రగ్విణి, వనమయూరం, తరలం, మత్తకోకిల, ఉత్సాహ, సుగంధి వంటి విశేషవృత్తాల్లో పద్యాలు చెప్పి ఛందోవైవిధ్యం ప్రదర్శించారు. బుద్ధినైశిత్యంతో, శబ్దసంస్కారంతో అవధాని చెప్పినపద్యాలు - అలవోకగా చెప్పినా, ఆలోచించి చెప్పినా అవధానపరిషత్తును అలరించాయి.

చి|| రాంభట్ల పార్వతీశ్వరశర్మ తన ప్రతిభకు తోడుగా వ్యుత్పత్తిని ఇనుమడింపజేసుకొని నిరంతరాభ్యాసంతో భవిష్యత్తులో ఇతోధికంగా అష్టావధానాలు, శతావధానాలు నిర్వహించి తెలుగునాట అవధానవిద్య మహోజ్జ్వల వైభవానికి దోహదం చేయగలరని ఆశీస్తూ... అభినందిస్తున్నాను.

– డి.వి. సూర్యారావు.

'కవివతంస' **బులుసు వేంకటేశ్వర్లు,** 'కల్పవృక్షం'
తెలుగుపండితులు, ఆదర్శ్‌నగర్, చిట్టివలస,
ప్రధానోపాధ్యాయులు (రి). సెల్: 9949175899.

భారతీ కృప

శ్రీయుతులు రాంభట్ల పార్వతీశ్వరశర్మగారికి ఆశీస్సులు. చాలా అవధానాలు చూసేను. అవధానిపై ఎంతో మానసికమైన ఒత్తిడి ఉంటుంది. దానిమీద తనధోరణికి అడ్డువచ్చే అంశాలపై అసహనం ఉవ్వెత్తున క్రమ్ముకుంటుంది. క్షణికావేశంలో ఏదో కటువైనమాట నోటినుండి జారిపోతుంది. పెద్దలమనస్సు చివుక్కుమంటుంది. వాళ్ళు పెద్దమనసుతో ఊరుకున్నా అది అవధానానికి మచ్చగా మిగిలిపోతుంది. అవధానికి చాలా సంయమనం ఉండాలి. ఏ మాట ఎవరికి తగిలి గాయపరుస్తుందో గమనించుకోరు చాలామంది అవధానులు.

దీనికి భిన్నంగా మీ శతావధానం సాగింది. ప్రత్యక్షసాక్షిని నేను. మీరు ఎక్కడా అసహనానికి, ఆగ్రహానికి గురికాకుండా శాంతంగా సంస్కారవంతంగా మూడు రోజులు వేదికపై ఉండడం – మరీ ఇంత చిన్న వయసులో నన్ను అబ్బురపరిచింది. మీరు ఇల్లాగే మంచి కవిగా గొప్ప సంస్కారవంతంగా ఎదగాలని నా ఆకాంక్ష. అవధానపద్యాలన్నీ చూసేను. బాగున్నాయి ప్రచురించండి.

సీ॥ అనితరసాధ్యమౌననుచు దీవించె నీ –ఆశువుఁజూచి కృష్ణయ్యగారు
అద్భుతంబనుచు నిన్నాశీర్వదించె కో – టారావుగారు తోడన వసించి,
కవితార్థములశిర:కంపమ్ముతో మెచ్చె – ఆచార్య సార్వభౌమాఖ్య బుధుడు
మలయవాసిని అమ్మ మనసార కొండాడె – నీపద్యనిర్మాణ నిపుణతలకు

తే.గీ॥ కోట నరసింహ సత్కవికోవిదుండు – లక్ష్మినారాయణుండు సలక్షణముగ
నడుప –శతవధానజయమ్ముఁబడసి నావు – భారతీకృప – రాంభట్ల పార్వతీశ!

ఆశీస్సులతో...
బులుసు వేంకటేశ్వర్లు
5.12.2015.

ఆంధ్ర పద్యకవితాసదస్సు రాష్ట్ర అధ్యక్షులు
శ్రీ కె. కోటారావు, ఎం.ఏ. తెలుగు., ఎం.ఏ సంస్కృతం.,
ఆంధ్రోపన్యాసకులు (రి),
అనకాపల్లి. సెల్: 9440977810.

సంపూర్ణ శతావధానం

శతాధిక గ్రంథకర్త 'కవిశేఖర' కొండేపూడి సుబ్బారావుగారి శత జయంతి ఉత్సవాల్లో 'అవధానసుధాకర' రాంభట్ల పార్వతీశ్వర శర్మ శతావధానం ఏర్పాటుచేసిన కొండేపూడి సర్వేశ్వరప్రసాద్‌గారికి ముందుగా నా అభినందనలు.

నవంబరు 18,19,20 తేదీలలో విశాఖ, కళాభారతిలో జరిగిన రాంభట్ల వారి శతావధానం సంపూర్ణంగా విజయవంతమైంది. అవధానచరిత్రలోనే విశాఖజిల్లాకి శతావధాని లేని లోటును తీర్చింది. అంతేకాదు – చిన్నవయస్సులో (26) శతావధానం చేయడం మరో విశేషం. పూర్వం చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారి శిష్యుడు వేలూరి శివరామశాస్త్రి, (18) కాశీకృష్ణాచార్యులు (19) తమకు ఇరవైయేండ్లు నిండకుండానే శతావధానాలు చేసి మన్ననలు పొందినట్లు పెద్దలు చెబుతుంటారు.

ఈతరంలో గురుసహస్రావధాని డా॥ కడిమిళ్ళ వరప్రసాద్ తన ఇరవయ్యో యేట (భాషాప్రవీణ ఫైనల్) లోనే శతావధాని అయ్యేరు. అతిచిన్న వయసులో అనగా తన 14వ యేటనే అష్టావధానాలు ప్రారంభించిన జాన దుర్గామల్లికార్జునరావు ఇరవైయేళ్ళు రాకుండానే అమలాపురంలో శతావధానం చేశారు. చిరంజీవి కడిమిళ్ళ శ్రీవిరించి ప్రభృతులు విద్యార్థిదశలోనే శతావధానాలుచేసి మన్ననలు పొందడం గొప్పపరిణామంగా భావించవచ్చు. ఇదే వరుసలో రాంభట్ల వారు కూడా నిదానంగా నిర్భయంగా 25 సమస్యలు, 25 దత్తపదులను, 25 వర్ణనలను, 25 ఆశువులను పూరించి 3 రోజుల్లో శతావధాన విజయపతాక నెగురువేసారు.

ఇప్పుడు అవధాని పూరించిన సమస్యలు, దత్తపదులు, వర్ణనల్లో కొన్నింటిని పరిశీలిద్దాం.

సమస్యలు

"సమస్యతే సంక్షిప్యతే అనయేతి సమస్యా - సమస్యా తు సమాసార్థా" అని అమరసింహుని నిర్వచనం. పృచ్ఛకుడు ఇచ్చిన పద్యపాదాన్ని సరిపెడుతూ అర్థానుగతి కలిగేలా తక్కిన మూడు పాదాల్ని పూరించడం.

3. **ప్రవరుడునవ్వరూథినిని పట్టి సుఖించె హిమాలయంబునన్**

పూరణ : శాంబరీ – ప్రవరుడు = శాంబరీవిద్యచే ప్రవరరూపాన్ని పొందిన గంధర్వుడు.

4. **బాంబులు భారతావనికి బంగరు పంటలు కూర్చు మిత్రమా**

పూరణ : మేఘ సత్ కదంబ + అంబులు = మేఘపంక్తుల్లోని నీళ్ళు. ప్రాణాలు తీసే బాంబులు అవధాని చేతిలో బంగారు పంటలనిచ్చే నీళ్ళయ్యాయి.

6. **కన్నము బెట్టువాని ననఘాయని పిల్చిన సార్థకంబగున్**

పూరణ : నీకు + అన్నము, సమస్యాపాదంలో యతి విరుపులోకూడా కుదిరింది.

13. **భర్త యల్లుడయ్యె భార్యకిపుడు**

పూరణ : భూ భర్త = రాముడు. భార్యకు = జనకుని భార్య రత్నమాలకు.

14. **సానికైదును పది జేసి సాగిలుదురు**

పూరణ : పల్కుల దొరసానికి = సరస్వతీదేవికి, ఐదును పదిచేసి = రెండు చేతులు జోడించి సాష్టాంగపడుదురు.

22. **నీరు దప్పితీర్ప నేరదాయె**

పూరణ : కఱవువలన రైతునకు వచ్చే కన్ + నీరు = కంటినీరు దప్పితీర్చదాయె యని.

దత్తపదులు

పృచ్ఛకుడిచ్చిన పదాలు ఏ పద్యానికిమిడుంటాయో ఆ పద్యంలో అర్థానుగుణంగా సరిపెట్టి వ్రాసిన దానిని దత్తపది అంటారు.

9. సుత్తివేలు – రాళ్ళపల్లి – బాబుమోహన్ – బ్రహ్మానందం – కళ్యాణానంతరం కన్యాదాత మనస్థితి.

పూరణ: ప్రేమదాసు + ఉత్తివేలు పట్టి; రాళ్ళపల్లి గ్రామంలో; ఓ బాబు! మోహనాంగి; బ్రహ్మానందము + అనిశమంద - మనుము. ఈ సినిమా నటుల పేర్లు చక్కగా పొదిగి కన్యాదాత మనస్థితిని వర్ణించడం కవిప్రతిభకు తార్కాణం.

19. శవము - పాడె - కాడు - చితి - జన్మదినోత్సవాల పరంపర.

పూరణ : శైశవములో 'శవము', పాడెనులో 'పాడె', ఆశయములకాడుటలో 'కాడు' మరచి తినెడులో 'చితి'ని పేర్చి అమంగళపదాలను అనుకూలపదాలుగా మార్చిన తీరు ప్రశంసనీయం.

వర్ణనలు

పృచ్ఛకుడు తనకు తోచిన విషయాన్ని వర్ణించమని కోరుతూ ఛందో నిర్దేశం కూడా చేయగా అవధాని ఆ విషయాన్ని వర్ణిస్తాడు.

1. **రైతుల ఆత్మహత్యలు - ప్రభుత్వ బాధ్యత.**

భావం : రైతులను ఆత్మహత్యలనుండి ఉద్ధరించాలంటే ప్రభుత్వం పంటకు మద్దతుధర, ఋణాలమాఫి చేసి దైవంలా ఆదుకోవాలని అవధాని కందంలో చెప్పారు.

6. **'ప్రసన్నభారతి'ని నడుపుతన్ను తీరును చూసి ప్రసాద్‌గారిపై సుబ్బారావుగారి పుత్రోత్సాహం.**

భావం: "నిబద్ధతతో ప్రసన్నభారతి పత్రికను నడపడం చూసాను. ఉత్తమమైన విలువలతో పత్రికను నడిపే పండితుడవని విన్నాను. కుమారా! ఇంత సులువుగా ఎవరు నడుపగలరు? ఇదంతా దైవప్రసాదంగా భావిస్తాను" అని పుత్రుడ్ని మెచ్చుకుంటూ సుబ్బారావుగారు సంతోషిస్తూ ఉంటారు.

14. **అవధానం పట్ల యువత ఆకర్షితులవ్వాలంటే.**

భావం: పాఠశాల స్థాయినుండి పద్యం చదవడం నేర్పాలి. నేర్పడంలో ఓర్పుచూపాలి. నీతులు చెప్పడం కాదు. చేతల్లో చూపించాలి. అపుడు పద్యం నిలిచి అవధానం ఎన్ని ఏండ్లయినా జీవిస్తుంది.

17. విశాఖలో అభివృద్ధి చెందుతున్న శాస్త్ర-సంగీత-సాహిత్యాలు.

భావం: సంగీతసాహిత్యాది లలితకళలకు, శాస్త్రపాండిత్యాలకు, వేదవిద్యలకు, ఇప్పుడీ శతావధానానికి కూడా పెన్నిధానమయిన ఈ విశాఖ కీర్తి పేటపేటలూ దాటాలని అవధాని పార్వతీశ్వరశర్మ ఆకాంక్ష. తథాస్తు.

తరువాత అప్పుడప్పుడు చెప్పిన ఆశువులతో 'సంపూర్ణశతావధానం' పూర్తయింది. అవధానికి శుభాభినందనలు.

ఇట్లు
కె.కోటారావు,
అనకాపల్లి.

21 నందీ పురస్కార విజేత, స్వర్ణకిరీట గ్రహీత
'సంగీత నవావధాని' **డా. మీగడ రామలింగస్వామి**
ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీకళాశాల (రి)
విశాఖపట్నం. చరవాణి : 9440189229

అక్షరాశీ:

తెలుగుజాతి గర్వంగా నావి అని చెప్పుకోదగ్గవి అవధానం, పద్యనాటకం. అవధానం పండితైకవేద్యం. పద్యనాటకం పండితపామరులకు ఆనందదాయకం. అవధానంచెయ్యడమే గొప్ప అనుకుంటే, శతావధానం చెయ్యడం చాలా గొప్ప. ఎంతో సాధన, ప్రతిభ, ధారణ మొదలగు అంశాలు ఉంటేనే గాని సాధ్యపడని విశిష్ట ప్రక్రియ. అలాంటి విశిష్టప్రక్రియను అతి పిన్న వయస్సు(26)లో మన శర్మ చేయడం, కృతకృత్యుడు కావడం నాకు ముఖ్యంగా చాలా ఆనందదాయకం.

సమస్యలు, దత్తపదులు, వర్ణనలు అన్నీ కొత్తభావాలతో గుదికూర్చాడు. పృచ్ఛకులు సంధించిన ప్రశ్నలను, సమస్యలను సమర్థవంతంగా సానుకూలపరిచాడు. ఇంకా ఇది మొదటి శతావధానమే అయినా నిబ్బరంగా నిలబడ్డాడు. నేనూ వెళ్ళి ప్రత్యక్షంగా చూసాను. తొట్రుపాటులేకుండా బాగా అలవాటయిన వాడిలా అవధానం సాగించాడు. మధ్యలో ఆశువులు, అప్రస్తుతాలకు సరైన రీతిలో స్పందించాడు. చివర ధారణకూడా చక్కగా చకచకా చేశాడు. వర్ధిష్ణువైన అవధానికి ఇంతకన్నా ఏం కావాలి? ఈనాటి ఈ శతావధానికి నేనూ కొన్నాళ్ళు పాఠం చెప్పానని, ఎప్పుడూ అనుకునే అవకాశం కల్పించాడు. అందుకునాకు మరీ ఆనందం. గర్వంకూడాను.

ఇక ఏ రంగంలో ఉన్నవాడు ఆ రంగంలో ఉన్న లబ్ధప్రతిష్ఠుల్లో తనకిష్టమైన వాళ్ళను ముందుగా అనుకరించడం, తరువాత అనుసరించడం, తదుపరి తనదైన

బాణీని ఏర్పరుచుకోవడం సర్వసాధారణం. ఇతడూ అలాగే చేస్తాడని, చెయ్యాలని నా భావన. మరింత శబ్దజ్ఞానం, అర్థజ్ఞానంతో పాటు ధాతుజ్ఞానంకూడా మూటకట్టుగుని 'విశాఖశతావధాని' అనే పేరును పొందాలని నా ఆశ. ముందు తరాలవాళ్ళకు ఇతడూ మార్గదర్శకం కావాలని నా శుభకామన.

"శర్మ! అక్షర శిల్పుల చలువతోడ
దేశ దేశాల నీకీర్తి తిరుగుగాక!!
శతశతావధానాలతో సాగుగాక!!
తెలుగు వెలుగుతో నీప్రభ వెలుగుగాక!"

హితైషి
మీగడ రామలింగస్వామి
15.12.15

'భారతీభూషణ' 'నంది పురస్కార గ్రహీత'
'తిరుమల బ్రహ్మోత్సవవ్యాఖ్యాత'
రాంభట్ల నృసింహశర్మ
విశాఖపట్నం

అవధానసుధాకరుని శతావధాన శరచ్చంద్రికలు

"ఒక నూరేయననేమిలెక్క? వినుడోహో! పండిత శ్రేష్ఠులా
ర! కడున్ వేగమె వేయిమందికయినన్ రమ్యస్థితుల్ మీర నా
శు కవిత్వంబొనరింప నేరుతుము, శ్రీ శూలిప్రియామాననీ
య కటాక్షమ్మున తగ్గ కాలమును మా కర్పించి కూర్చున్నచోన్"

...సరే, మాన్యశ్రీద్వయం, అవధానకళాద్వైత పుంభావశారదామూర్తి-మత్త్వమయిన తిరుపతి వేంకటకవులు ఒకానొక సందర్భంలో చెప్పిన ఈ పద్యాన్ని యెకాయెకీ పట్టుకున్నారు ప్రసన్నభారతీ సాహితీసంస్థవారు. ప్రసన్నభారతి అంటే అనవద్య పద్యవిద్యకు అకుంఠితదీక్షాపీఠం. పైగా దీని స్థాపకులు ప్రముఖపద్య గ్రంథకర్త స్వర్గీయ కొండేపూడి సుబ్బారావు గారు. ప్రస్తుతం ఆ సంస్థ అధ్యక్షులు సుబ్బారావుగారి అబ్బాయి శ్రీమాన్ సర్వేశ్వర ప్రసాద్‌గారు.

సుబ్బారావుగారి శతజయంతి సందర్భగా శతావధానం జరిపించాలని పట్టిన పట్టుపెద్దదే.. కానీ పట్టుకొన్న కొమ్మే చిన్నది. అవధాని వయసు 27 వసంతాలు.. అవధానాల ప్రాయం 36 హసంతాలు.. అవీ అష్టావధానాలు. పైగా ఇటీవలే పెళ్ళి కూడా అయింది... దానికి తోడూ సంతానం కూడానూ.. అవధానం అంటే వ్యగ్రత లేని ఏకాగ్రత కదా! అయితేనేం సర్వేశ్వర సంకల్పానికి ఆచార్య సార్వభౌమ వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు వత్తాసు పలికేరు. సాహితీవేత్తలు ఆచార్య పి.వి.కృష్ణయ్యగారు, డి.వి. సూర్యారావుగార్లు మద్దతునిచ్చేరు.

ధార, ధోరణి, ధారణలకు తోడుపడిన ధైర్యంతో తన తొట్టతొలి శతావధానానికి సమాయత్తమైన ఆ చిరంజీవి అష్టావధాని రాంభట్ల పార్వతీశ్వర శర్మ... అప్పటికే

లలితపీఠం వారి ఆశీ:పూర్వక **'అవధానసుధాకర'** బిరుదాంకితుడు... కనుకనే శతావధాన కవితాఖండికలంటే శరచ్చంద్రికల కలకండ పలుకులే.

కాబట్టే – తిరుపతి వారన్నట్టుగా " శ్రీ శూలిప్రియామానసీయ కటాక్షమ్మున తగ్గ కాలమును" 2015 వ సం॥ నవంబరు నెల 18, 19, 20 తేదీల్లో అర్పించి కూర్చున్న విద్వద్వరేణ్యులాసీనులైన కోవిదపరిషత్తు, కోవెలవంటి కళాభారతిలో ఏర్పాటైంది చి॥ పార్వతీశ్వరశర్మ శతావధానం.

ప్రారంభ సభాధ్యక్షులు వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రిగారు. ముఖ్యాతిథి శ్రీలలితపీఠాధిపతి, కుర్తాళం శంకరాచార్య, పరమహంస పరివ్రాజకాచార్య, శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి వారు. డా. సూరపనేని విజయ్‌కుమార్‌గారు గౌరవఅతిథిగా హాజరైన ఆరంభ సభాసంచాలకులుగా అనకాపల్లి ఆచార్యులు డా. కె. కోటారావుగారు వ్యవహరించారు.

నవంబరు 18 నుండి 20వ తేది సాయంత్రం వరకు సంరంభంగా సాగిన శతావధానసాహితీ మహాక్రతువులో మూడురోజుల పద్యపర్వసర్వస్వంలోంచి ముద్దొచ్చే ముచ్చట్లు కొన్ని...

"బాంబులు భారతావనికి బంగరుపంటలు కూర్చుమిత్రమా" అని కూర్చున్నారు విశాఖవాసి కారె అనూరాధ గారు. ఇది నిజంగా సమస్యే... అసంగతాన్ని ఒసంగడం సులువే.. దాన్ని సుగమసంగత్వాన్ని చెందిస్తూ పూరణ చిందించడమే ప్రతిభ... ఊరించి ఊరించి ఊహించని పూరణతో సభనూగించి శభాష్నింపుకున్నారు అవధాని. **"సాంబుని సత్కృపంగొనగ సర్వము..."** అంటూ బాంబులను 'కదంబ అంబులు'గా కురిపించి మెరిపించి మురిపించారు.

దత్తపదుల విషయానికి వస్తే **"సుత్తివేలు, రాళ్ళపల్లి, బాబూమోహన్, బ్రహ్మానందం"** పేర్లతో స్వార్థకత్యాగంతో కల్యాణానంతరం కన్యాదాత మనస్థితిని వర్ణించమన్నారు హైదరాబాద్ నివాసి శ్రీ ద్విభాష్యం వేంకటేశ్వర్లు...

"వెడలు నీ ప్రేమదాసుత్తి వేలు పట్టి" అంటూ రాళ్ళపల్లిని ఊరుగా, బాబూ! అంటూ మోహనాంగిని మనసూరగా ప్రయోగించి బ్రహ్మానందం కలిగించారు.

సాహిత్యవిద్యాధ్యయనం, అవధానపద్యాలంకరణం చిత్తవృత్తిగా గలవారికి ఛందస్సు, వ్యాకరణాలతో పాటు చరిత్ర, వ్యావహారికజ్ఞానం పుష్కలంగా ఉండాలి.. ఉంటే వచ్చే మంచి పద్యాలెలా ఉంటాయో.. ఈ శతావధానంలోని వర్ణనల్లోంచి మచ్చుకొక్క మెచ్చుకోలు. **"హుద్-హుద్ తుఫాన్ తరువాత కోలుకున్న విశాఖ మహానగరాన్ని వర్ణించమన్నారు"** విశాఖపౌరురాలు ఆదూరి విద్యావతి. శకుంతల తామరాకుమీద ప్రేమలేఖరాసినట్టు **"వెలిగె దీపము జీవముంగొని"** అంటూ 'తరలం' ఛందస్సున, కోలుకున్న విశాఖ ప్రగతిశాఖను రేఖాచిత్రంగా గీసిచ్చారు అవధాని.

సమస్యలను సజావుగా, దత్తపదులను దర్జాగా, వర్ణనలను వన్నెలమిన్నగా.. పూరిస్తూ ఆశువులను అలవోకగా ధారవోసిన పార్వతీశ్వరుని సద్యస్ఫురణాంశువులైన ఆశుపద్యావళిలోంచి అలతిగా కొన్ని...
కవిశేఖర కొండేపూడి వారి గురించి నిండైన పద్యం :

"కొండేపూడి శుభాన్వయ - పండితకవిశేఖరుండు వరమై నాకున్
దండిగ నుండగ నండగ - పండదొకో సస్యకవిత పరమాన్నంబై"

అన్ని విభాగాల్లోనూ అందగించిన అవధాని ప్రతిభ మరింత అద్భుతంగా రాణించిన విభాగం ఆశువు... మూడురోజుల అవధానోత్సవంలో ప్రేక్షకాగారంనుండి వేదులవారు "శతావధానం చేస్తావా అని పార్వతీశ్వరశర్మని అడిగినప్పుడు వేదులవారి హృదయభావన" ఎలా ఉంటుందో చెప్పమన్నప్పుడు - అవధాని అందించిన పద్యస్పందన... కవి ఆత్మవిశ్వాసానికి రత్నదర్పణం.

"చేయగలడువీడు చిక్కగా, చక్కగా - శతవధానమేని ధృతివహింప
మనుమడైనగాని మన్ననలందును - 'శారదాంబ' ప్రోచి సాకినంత". అవును మరి. వేదుల వారి ఇంటిముందరగల ఫలకానగల పంచాక్షరి 'శారదాపీఠం'. ఆ దంపతుల హృదయవాత్సల్యం నిరాఘాటం.

సర్వశ్రీ బులుసు వేంకటేశ్వర్లు, కోటలక్ష్మీనరసింహం, మల్లాప్రగడ శ్రీమన్నారాయణ, డి.వి. సూర్యారావుగారి వంటి దిగ్గంతులు, భాషాయోష.. విదుషీమణి ఆచార్య శ్రీమతి డా. కోలవెన్ను మలయవాసిని వంటి అక్షరశేముషీమూర్తులు పాల్గొన్న శతావధాన సభ విజయోత్సవం ఎలా జరుగుతుందోకూడా ముందే ఊహించినట్లుగా అవధాని పార్వతీశ్వరశర్మ -

" ఈ కళాభారతిన్ పద్యమే తపస్సు!
మాకిట ప్రసన్న భారతి మార్గమయ్యె!
పద్యహారతి పట్టగ పండితాళి
విజయసారథినయ్యెద వినయమొప్ప"

అని చాటిన చాటువు విజయోత్సవం నాటి జేజేలకు హేతువు.. శతావధాన సంపూర్ణ సంతృప్తికి సేతువు. ఆ నాటికిది దత్తపది. ఎప్పటికీ దత్తుడీయగా పదిలమైన దీక్షావిధి. "విజయసారథినయ్యెద వినయమొప్ప" – ఈ వాక్యమే ఏ జయాఖ్యానానికైనా ఆది... పునాది... ఆద్యంతరసాహ్లాది. మా పితామహులు, అవధాని ముత్తాత అయిన డా. రాంభట్ల వేంకటరావు మహోదయులన్నట్లు –

"కవితల్ చెప్పగ నేర్చిన కవివృషభులకెన్న నదనుకాలము తలపన్
భువిని'శరదృతువు' తడిసిన భువితల మాబోతుకైన పొలుపున మిగులన్"

ఆ ప్రపితామహుని 'సిరా'క్షర ఫలకంవలె ఈ అవధాన సుధాకరుని శతావధాన శరచ్చంద్రికలు కురిసి.. పద్యబ్రాహ్మీ – మురిసినది కూడా శరదృతువులోనే.. ఆ సాహితీక్రతువులోనే. ప్రతిభవ్యుత్పత్తి అభ్యాసంతోపాటు ధార, ధోరణి, ధారణలకూడికకు జతపడాల్సింది 'ధైర్యం' – అదే ఈ సాహిత్యసాహసప్రక్రియాధైర్యం. ఇదంతా చి॥ పార్వతీశ్వరశర్మ వంతైతే 8వ తరగతి నాటికే పద్యబీజం నాటుకునేలా చేసిన కీర్తి పితామహులు, పద్యరచనోపాధ్యులు స్వర్గీయ రాంభట్లపార్వతీశ్వరశర్మ (తాత నామమే అవధానిది కూడా) గారిదే.

"పుత్రక నీ పూరణ హృత్, క్షేత్రమ్మున భావి విజయకేతనమెత్తెన్
ఆత్రమ్మున శారద జయ సూత్రమ్ములనల్లుచుండె సూనుని కొఱకై" అని నే పలికిన ఆశీరాశువు ఆ నాటి నూఱుపద్యపు కబ్బముల తిరునాళ్ళ పరిపాటిగా మాత్రమేకాదు. ఏనాటి శత, సహస్రావధానాల మేరువుల అధిరోహణకైనా క్షీరబలాన్నిచ్చే కామధేనువు.. శుభకామనల సువర్ణ పర్వ పర్వత సానువు...

ఇతిశమ్

– రాంభట్ల నృసింహ శర్మ

శతావధాన ప్రార్థన పద్యాలు

అజహరి రుద్రాదులకున్
భజనసులభుడైన వేల్పు వరదాయకునిన్
గజవక్త్రు సంస్మరింతును
నిజభక్తిన్ సర్వకార్య నిర్విఘ్నతకున్

శ్రీంమంత్రమ్మున విఘ్నముల్ తొలగ సంసిద్ధిన్ ప్రసాదించు, పై
నైంమంత్రమ్మున నాశ్రితాళికి సమస్తైశ్వర్యముల్ కూర్చు, నోం
హ్రీం మంత్రమ్ముల స్వస్తి యెల్లరకు శ్రీ హేరంబు పాదార్చనన్;
గ్లౌంమంత్రార్చిత బీజ సుస్థిర నమో! గం గం గణాధీశ్వరా!!

కవితాలంకృత! గౌణజృంభిత! లసద్గాంభీర్య వస్త్వన్వితా!
నవభావప్రథితప్రభాసిత! రసానందాబ్ధి సమ్మోహితా!
శ్రవణామోదవచోవిలాస మహితా! సాహిత్యసంశోభితా!
అవధానాద్భుత పీఠసంస్తుత! నమో వ్యాహార మాతా! స్మితా!

వాణీ నీదయ లేని నాడు జగతిన్ వాక్సూనముల్ విచ్చునే?
వీణాపాణి, వినోద నాదచయ సంవిత్సంపదాశ్రేణి, గీ
ర్వాణీ మ్రొక్కెద సర్వశాస్త్రజననీ వాగ్దాయినీ బ్రోచి, బ్ర
హ్మాణీ పల్కులరాణి సంతతము జిహ్వాగ్రమ్మునన్ నిల్వుమా!

పంచముఖమ్ములన్ వెలసి భక్తుల బ్రోచెడు వేదమాత! నీ
పంచను జేరి వేడెదను, పాదములన్ విడనింకదేవి; నే
నెంచితి నీవ దైవముగ నేమని జెప్పుదు నీదుశక్తి? రా
యంచయె వాహనమ్ముగ మదార్తిని దీర్చు, మదంబరో నతుల్!!

మౌనిముఖ్యుల హృద్వనమ్ములె మాడవీథుల రీతిగా
శ్రీనివాస చరించెదీవను చింతనన్ సతతంబు నా
మానసంబున నీదు నామమె మాటిమాటికి నెంతు నన్
గానవయ్య భజింతు నిత్యము కల్మినేలు ప్రభో నతుల్

కలనైనన్ నిను మఱవక
దలతుము రాంభట్ల వంశ దైవమ! సతమునన్
నిలకడతో మము గాచెడి
యిలువేలుపు 'వేంకమాంబ' నిదె ప్రార్థింతున్

నవమాసంబులు మోసి ధాత్రికరణిన్ నన్నోర్మి గాంచెంగదా
స్తవనీయంబగు రామభట్ల కులమున్, సార్థక్యునిన్ జేయగా
కవనంబున్ నను గోరుముద్దలనగా గావించె 'కామేశ్వరీ'
నవలారత్నమునాత్మనెంతు సతతానందైక సౌధమ్మునన్!

శిక్షైనన్ తట్టుకొనుచు
వృక్షమువలెనీడనిచ్చునిలలో తండ్రే!
అక్షరలక్షల గాయ
త్ర్యక్షీణ జపేంద్రు 'సోమయాజిన్' తలతన్!!

చెప్పెదనంచు సత్కవిత! చేరి పితామహ! అంకపీఠిపై
విప్పితి నా గళమ్ము తొలి; విస్తృత విశ్రుతమట్లు గాగ నా
తప్పులు త్రెళ్ళ జేయుచు విధాతగ, తాతగ, సుప్రదాతగా
నొప్పుగ దీర్చెనన్ను! నిను నొజ్జగ దల్చెద 'పార్వతీశ్వరా'!!

రాంభట్లాన్వయ కీర్తికేతనమునాన్ రాజిల్లె ముత్తాత మా
కంభోజాక్షుని భంగి, సద్యశము తానార్జించె తద్భిక్షగా
నంభోజాసనుభామినిన్ గొలువ శక్త్యాశక్తి మాకబ్బనే!
సంభావించెద 'వేంకటార్యుని' మదిన్ సత్యమ్ము నిత్యమ్ముగా!!

అతిమాధుర్య కవిత్వ పూజనముచే ఆర్యా కృపంబొంది భా
రతి పూజించె వధాన సూనముల నశ్రాంతశ్రమంజేసి, యా
శ్రిత మందార యతీంద్రునిన్ బుధుని శ్రీ సిద్ధేశ్వరానంద భా
రతి పాదంబుల నాశ్రయింతు నిదె సర్వార్థప్రభాశోభకై

ఇలువేలుపు శ్రీశ్రీశ్రీ వెంకమ్మ పేరంటాలు, శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆశీస్సులతో...

'ప్రసన్నభారతి' సాహిత్య పత్రిక నిర్వహించిన

"సంపూర్ణ శతావధానము"

అవధాని : 'అవధాన సుధాకర' శ్రీ రాంభట్ల పార్వతీశ్వర శర్మ

18, 19, 20 – నవంబరు, 2015.
కళాభారతి ఆడిటోరియం, మద్దిలపాలెం, విశాఖపట్నం.

సమస్యలు:

1. కడిమిళ్ళ శ్రీవిరించి గారు, నరసాపురం.

రాతికి మ్రొక్కువారికి నిరంతర సౌఖ్యము లభ్యమయ్యెడిన్

ఉ॥ పోతన తొల్లివ్రాసెనయ పొల్పుగ భాగవతమ్మునందు క్షో
ణీతల రాజసింహమవనిన్ పరిపాలన జేసియుండె, వి
ఖ్యాతినిగన్న రామునకు, కార్యముదీరగ నెంచి రావణా
రాతికి మ్రొక్కువారికి నిరంతర సౌఖ్యములభ్యమయ్యెడిన్!!

2. బి.వి. బంగార్రాజు గారు, విశాఖపట్నం.

ఉగ్రవాదమె విశ్వమందున యుక్తమైనది చూడగన్

మత్తకోకిల:

అగ్రగామిగ నున్న దేశపుటంచులన్ గలదెప్పుడున్
భూగ్రహమ్మున కక్ష దెల్పుచు పొందికల్ విడనాడగా
నాగ్రహించుచు, శాంతిగూల్చగ, నల్లలాడ ప్రజాళియే
ఉగ్రవాదమె విశ్వమందున యుక్తమైనది చూడగన్.

3. కోడూరు శ్రీలక్ష్మి గారు, విశాఖపట్నం.

ప్రవరుడునవ్వరూథినిని పట్టి సుఖించె హిమాలయంబునన్

చ॥ జవముననేగెనా ద్విజుడు చక్కగ శీతనగమ్ముగానగా
నవిరళ హోమతత్పరున కంద వరూథిని కోర్కెదెల్పె సం
స్తవమునఁబొందెనగ్నికృప, సాగెను గీమున, కంత శాంబరీ
ప్రవరుడునవ్వరూథినిని పట్టి సుఖించె హిమాలయంబునన్.

4. కారె అనూరాధ గారు, విశాఖపట్నం.

బాంబులు భారతావనికి బంగరు పంటలు కూర్చు మిత్రమా

ఉ॥ సాంబుని సత్కృపంగొనగ సర్వము మంగళమౌట తథ్యమౌ
వెంబడి వచ్చు సంపద, వివేకము వృద్ధిగనున్ స్థిరమ్ముగా
సంబరమై కృషీవళులు సంతసమందగ మేఘ సత్కదం
బాంబులు భారతావనికి బంగరు పంటలు కూర్చు మిత్రమా.

5. కన్నేపల్లి వరలక్ష్మి గారు, విశాఖపట్నం.

మానవత్వము వీడి సోదర మంచిగా నివసింపుమా

మత్తకోకిల:

గ్లానికల్గక యుండ మిత్రుల గావ జెల్లును ప్రేమతో
పూని తోడయి కార్యరాశిని పుణ్యముల్గొన లెస్సయౌ
హానిచేయగ, నంతముంగొన నక్కటా! మతమందురే
మానవత్వము వీడి? సోదర మంచిగా నివసింపుమా!!

6. కొప్పిశెట్టి సూర్యనారాయణ గారు, ఎలమంచిలి.

కన్నము బెట్టువాని ననఘాయని పిల్చిన సార్థకంబగున్

ఉ॥ కన్నదిగాని విన్నదియు గాని యొకానొక క్షామమక్కటా!
దున్నగ భూమియున్న పరితోషము గల్గనె చూడ జూడ రై
తన్నకు? జాతినంతటిని యాదరమొప్పగ గాచు వాడ! నీ
కన్నము బెట్టువాని ననఘాయని పిల్చిన సార్థకంబగున్

7. డా. ఎల్. ఎస్. యాజ్ఞవల్క్య శర్మ గారు, పాయకరావుపేట.

కవిత కనరాదు తిక్కన కవితలోన

తే.గీ॥ నిత్యసాధనన్ విద్యార్థి ప్రత్యయముల
శేషషష్ఠికి 'యొక్క' విశేషమమరు
కవిత కనరాదు, తిక్కన కవితలోన
సవ్యమౌను "నిర్ధారణషష్ఠి"నెపుడు

* **వ్యాకరణపరంగా** పూరించిన సమస్య ఇది. 'నిర్ధారణ షష్ఠి' కి 'కు' ప్రత్యయం చేరదు. అప్పుడు **కవిత + 'కు'** అనరాదు. **కవిత + 'లోన'** అని ఉండాలని భావం.

8. బెహరా వెంకటలక్ష్మి గారు, విశాఖపట్నం.

పాపము లేనిచో జగతి పాడయిపోవును నిశ్చయమ్ముగన్

ఉ॥ లోపము సద్గుణమ్ములన లోకమునందున జెల్లు రెండు నా
దీపపు నీడవెల్గులన దివ్యముగా మన సృష్టికర్థమై
ప్రాపుగగాచుపుణ్యము; ప్రపంచము గూల్చు నఘమ్ము; పుణ్యమున్
పాపములేనిచో జగతి పాడయిపోవును నిశ్చయమ్ముగన్

9. బత్తుకొండ నాగలక్ష్మి గారు, విశాఖపట్నం.

చరణంబులు లేనివాడు చకచక నడిచెన్

కం॥ తరియించి జీవవార్ధిని
నరుడొక్కడు పట్టెనంత నాకపు త్రోవన్
ధరనింతయు దుష్కర్మా
చరణంబులులేని వాడు చకచక నడిచెన్.

10. గుత్తి పుష్పలత గారు, విశాఖపట్నం.

అత్తకు మీసముల్ మొలిచెనల్లుడు వచ్చిన వేళయెట్టిదో

ఉ॥ తత్తరపాటునన్ వనిత తల్లికి చెప్పగనేగె నింటికిన్
వత్తురె బంధురాశియని వంటలు జేయగ నెంచెనామె, యా
యత్తముజేయ భోజనము హంగులతో, మసియంట మోమునం
దత్తకు, మీసముల్ మొలిచె నల్లుడు వచ్చిన వేళ యెట్టిదో!

11. ఎస్. కె. వల్లి గారు, విశాఖపట్నం.

కొట్టుకొనిపోవు గాలికి కొండలెల్ల

తే.గీ॥ ఇటులవర్షమ్ము కురియుట యింద్రమహిమ
పటుతరమ్మగు గిరియ గోవర్ధనమ్ము
కేలనెత్తితి రండు గోపాలురిటకు
కొట్టుకొనిపోవు! గాలికి కొండలెల్ల!!

12. వత్సవాయి శిరీష గారు, విశాఖపట్నం.

పదములు లేకుండ కవిత వ్రాయగ వచ్చున్

కం॥ "సదమలవాణీశుభ స
త్పదనూపుర రవవివిక్త వరగురుభావా
స్పదరచనగ" స్వర్భాషా
పదములు లేకుండ కవిత వ్రాయగ వచ్చున్.

13. డా. పి. రామచంద్రరావు గారు, కొవ్వూరు.

భర్త యల్లుడయ్యె భార్యకిపుడు

ఆ.వె॥ మిత్తిగొంగ విల్లు మిథిలలో భగ్నమై
చనగ – సీత వలచె ఘనుని రాము
జనకుడపుడు పలికె జనులతోనిటుల "భూ
భర్త యల్లుడయ్యె భార్యకిపుడు".

14. జెట్టి ఎల్లమంద గారు, నర్సీపట్నం.

సానికైదును పది జేసి సాగిలుదురు

తే.గీ॥ కవిత వ్రాయగనెంచచో కవులు తొలుత
కృతులనితిహాసముల శాస్త్ర తతుల మ్రొక్కి,
భవ్యమౌ పద్యములనిచ్చు పల్కుల దొర
సానికైదును పదిజేసి సాగిలుదురు.

15. నడిగట్ల వీరాకృష్ణారావుగారు, పాయకరావుపేట.

పడదు మత్స్యయంత్రమునాడు ఫల్గుణునకు

తే.గీ॥ అన్ని తానయి నిండు కంసారి లేక
యండయై విద్య గరపు ద్రోణుండు లేక
యగ్రజుండైన ధర్మజునాజ్ఞలేక
పడదు మత్స్యయంత్రము నాడు ఫల్గుణునకు

16. కె. నర్సింగరావు గారు, విశాఖపట్నం.

మోసమునకు మీసమొదవె మొనద్రిప్పుటకై

కం॥ ఆసలు చెల్లిన రాష్ట్రము
వేసారిన గుండెలవిసె వేచియు జూడన్
మా 'సౌభాగ్యపురిన్' గొన
మోసమునకు మీసమొదవె మొనద్రిప్పుటకై!!

17. 'కవిగాండీవి' ఎ.పి.వి. ప్రసాద్ గారు, విశాఖపట్నం.

దేవుడులేనెలేడని మదిన్ నెరనమ్ముచు గొల్తు భక్తితోన్

ఉ॥ నీవె ననున్ సమస్తమయి నిత్యము దీవనలందజేయుమీ
సేవల గొల్చెదన్ జనక ! శ్రీవయి, ధీవయి చేవ గూర్పుమీ
యీ విధి నీవధానమున నిమ్ము జయమ్మును! నీవె దక్క యే
దేవుడు లేనెలేడని మదిన్ నెరనమ్ముచు గొల్తు భక్తితోన్.

18. ఆచార్య పొన్నపల్లి వెంకట కృష్ణయ్య గారు, విశాఖపట్నం.

ధాటిగ నేనికన్ శతవధానమొనర్తును మూగవాడనై

ఉ॥ మాటలతల్లి! నన్నుగని మన్నన జేసినచాలు! మద్హృదిన్
పేటికజేసి, పద్యములపేరున పేరులుగట్టి, భక్తితో
నీటుగ నీకొనర్చెద! జనిన్ సఫలంబొనరించు! "పాండితిన్"
ధాటిగనేనికన్ శతవధానమొనర్తును "మూగవాడనై"

19. కె. కళ్యాణభారతి గారు, విశాఖపట్నం.

మగలు బరువు కాదె మగువలకును

ఆ.వె॥ "టీవి" చూడనేర్చి టీవిగా కూర్చున్న
పిలిచి పిలిచి వాని కలచుచుందు
రకట! యత్తమామలైనట్టి యా ఆలు
మగలు బరువు కాదె మగువలకును?

20. చావలి ఆంజనేయమూర్తి గారు, విశాఖపట్నం.

కామిని పాదనూపురము ఖంగునమ్రోగదు హేతువేమొకో

ఉ॥ ఆమని వచ్చెనంచు నయమారగ నెచ్చెలి వెంటరాగ, సం
ధ్యామయ దీప్తులన్ వనవిహారము జేయ, సరోవరంబునం
దామె పదంబులుంచి జతనాడుచు పాడుచునుండ – స్పష్టమే
కామిని పాదనూపురము ఖంగునమ్రోగదు "హేతువేమొకో".

21. డా. కందాళ కనకమహాలక్ష్మి గారు, విశాఖపట్నం.

మదగజయానకున్ రవికమాత్రమె చాలును చీరయేటికిన్

చం॥ పొదలను నక్కి గోపికల పొల్పుగ నారడి బెట్ట నెంచుచున్
వదలక కృష్ణుడావిధిని వారి శుభాంబరముల్ గ్రహించె; "మా
హృదయము గొంటివే, వసనమిమ్మ"ని వేడగ వెన్నుడిట్లనున్-
"మదగజయానకున్ రవికమాత్రమె చాలును చీరయేటికిన్?"

22. డా. కోలవెన్ను పాండురంగ విఠలమూర్తి గారు, విశాఖపట్నం.

నీరు దప్పితీర్చ నేరదాయె

ఆ.వె॥ కరవు బరువుకాగ, వరుణుడు కోపింప,
పుడమితల్లి కినుక బూనియుండ!
యాతనల్ తరింప రైతునకుబుకు - క
న్నీరు దప్పి తీర్చనేరదాయె.

23. లలితావాసిష్ఠ గారు, విశాఖపట్నం.

ధనము వ్యయింపగల్గినగదా! జననైక ఫలంబెరింగెడిన్

చం॥ అనిశము ద్రవ్యమీ జగతి కానతినిచ్చుచు నిర్వహించు, నిం
ధనముగ సర్వకార్యముల నౌకగ సాగగ జేయు; దైవచిం
తనమున దానముల్ నెరపి, ధార్మికవర్తనమందునెంచగా
ధనము వ్యయింపగల్గినగదా! జననైకఫలంబెరింగెడిన్.

24. దేవులపల్లి పద్మజ గారు, విశాఖపట్నం.

కాదనలేనిమానవత కర్ణుని రూపము దాల్చి యుండెడిన్

ఉ॥ వాదములందు దిట్ట, ఘనబాహుబలంబున లేరు కొట్టగా
నాదరమొప్ప దానమిడ నర్థులకాతడు రామచంద్రుడౌ
కాదొకొ ఘోరమావిధిని కాలవశమ్మునకూల? నెవ్వరున్-
కాదనలేనిమానవత కర్ణుని రూపము దాల్చి యుండెడిన్.

25. కాండూరి సీతారామ చంద్రమూర్తి గారు, విశాఖపట్నం.

పద్యము వ్రాయగా యతిని వద్దని చెప్పెద ముద్దు ఘాటుతో

ఉ॥ పద్యమనంగ ద్వేషమున వ్రాయగనెంచ గణంబులేలకో?
హృద్యముగాని భావముల హీనగతిన్ రచియించుటేల? సం
పాద్య పదాబ్ధి ద్రచ్చు నిరవద్యకవిత్వముకాక – "కాకవిన్"
పద్యము వ్రాయగా! యతిని వద్దని చెప్పెద! ముద్దు ఘాటుతో.

卐 卐 卐

ఇలువేలుపు శ్రీశ్రీశ్రీ వెంకమ్మ పేరంటాలు, శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆశీస్సులతో...

'ప్రసన్నభారతి' సాహిత్య పత్రిక నిర్వహించిన

"సంపూర్ణ శతావధానము"

అవధాని : 'అవధాన సుధాకర' శ్రీ రాంభట్ల పార్వతీశ్వర శర్మ

18, 19, 20 – నవంబరు, 2015.
కళాభారతి ఆడిటోరియం, మద్దిలపాలెం, విశాఖపట్నం.

దత్తపదులు :

1. పి.ఎస్.పి.వి.శర్మ గారు, విశాఖపట్నం.

ధనము, ఘనము, వనము, జనము – నేటి విద్యావ్యవస్థ

కం॥ ధనమే జగతికి మూలము
ఘనముగ నదిలేక విద్య కల్గుట కలదే?
కన నది పావనమయ్యెను
కొనగను జనమిచ్చిపుచ్చుకొంటల్ నేర్చెన్.

2. అవుగాడ అప్పలనాయుడు గారు, చోడవరం.

కవిత, వనిత, జనత, ఘనత – నూతన రాజధాని 'అమరావతి' నిర్మాణం

ఉ॥ లేక వితండవాదములు రేవులు కట్టుచు వృద్ధిపొందగా
తాకగ నింగి నాంధ్ర వనితామణి దీప్తులు విస్తరిల్లగా
వీకను తోషమున్ జనత వేచియు జూడగ కొల్వు దీరులే
నాకసమానమౌ ఘనత నవ్యతరాంధ్ర సురాజధానియై!!

3. కందాళ నాగలక్ష్మి గారు, శ్రీకాకుళం.

శంఖం, చక్రం, గద, ఖడ్గం - సమాజంలోనిఅన్యాయాలకు వ్యతిరేకంగా.

శా॥ పూరింపన్వలె శంఖమున్ యువతశంభోయంచు వెన్వెంట; నోం
కారంబట్లు ప్రశాంతతన్ ప్రగతి చక్రంబేగ సన్మార్గమం
దేరాజ్యంబుననైన జెల్లుగదరా! యీదేశమందేలకో
పోరుంజేయుట? ఖడ్గముంగొనుట? నంభోరాశియై పొరులే!

4. పూడిపెద్ది కృష్ణకిరణ్ శర్మ గారు, విశాఖపట్నం.

సరి, గమ, పద, నిస - భారతార్థంలో.

కం॥ గోకులవాస! రిపుల్గల
రే కనగ ? మహాత్ములుండిరీ కురుభూమిన్!!
నీకగు నాపదదీర్చుట,
నాకగునే హానిసలుప? నారాయణుడా!

5. డా. పూడిపెద్ది భరత్‌కుమార్ గారు, విశాఖపట్నం.

ఆశువు, సమస్య, వర్ణన, ధారణ - ఉద్యోగినులైన గృహిణుల దినచర్య.

ఉ॥ ఆశువుగాగ వంటపని నప్పటికప్పుడు పూర్తి జేసి, వా
రాశి సమస్యలుండినను ప్రస్థరమట్లు స్థిరైకచిత్తయై
ఆశయమ ట్లుపాధిగొనుటన్నది వర్ణనజేయుటెట్లొ? యా
కాశపుటెత్తు బాధ్యతల 'కంకణధారణ' నారి చేయులే !!

6. ఆకొండి అరుణశ్రీ గారు, అన్నవరం.

రంగ, తుంగ, భంగ, జంగ – కార్తికమాస వైశిష్ట్యం.

కం॥ మనమారంగ శివుంగని
ఘనముగ నుత్తుంగ యశము గాంచెదమయ్యా
జని నఘ భంగముగను గాం
చిన! గొల్తు భుజంగభూష! శ్రీ సర్వేశా!

7. పేరాల హరిప్రియ గారు, విశాఖపట్నం.

సచిన్, ధోని, విరాట్, వార్న్ – భారతార్థం

తే.గీ॥ వ్యాస! చిన్మయ రూప! నీ వ్రాత మహిమ
రమ్యముగ గంటినేను విరాట్స్వరూపు!
చాలునదియ! యధోనిధులేల? ననుచు
నిష్ఠ 'జైమిని' వేదవార్నిధి మధించె!

8. భాగవతుల వసుధ గారు, పెద్దాపురం.

వసుధ, సుధ, రామ, లక్ష్మి – శ్రీకృష్ణ వర్ణన.

తే.గీ॥ ఊహజేయంగ వసుధైక మోహనాంగ!
సుధలు చిందెడు పల్కులనిధివి నీవ!
శోభనామయ! సుజన మనోభిరామ!
మోక్షలక్ష్మిని గూర్చెడు ముఖ్య! కృష్ణ!!

9. ద్విభాష్యం వేంకటేశ్వర్లు గారు, హైదరాబాద్.

సుత్తివేలు,రాళ్ళపల్లి, బాబుమోహన్, బ్రహ్మానందం –కన్యాదాత మనస్థితి.

తే.గీ॥ వెడలు నీప్రేమదాసుత్తివేలుబట్టి
"రాళ్ళపల్లి"ని వేడుక రహివసింప
ముదిత నాపట్టి! ఓ బాబు మోహనాంగి!
మనుమ! శుభము, బ్రహ్మానంద మనిశమంద!!

10. దేవులపల్లి పద్మజ గారు, విశాఖపట్నం.

మందార, మకరంద, మాధుర్య, మధుప – పుష్పవర్ణన.

కం॥ ప్రేమం దారకు నీయగ
శ్రీమతి మకరందమమర చిరునవ్వొలుకున్
యేమా ధుర్యత? సుమమా!
మైమరచెద నందమునకు మధుపంబుగతిన్!!

11. చర్ల మృదుల గారు, నిడదవోలు.

కలము, జలము, ఫలము, హలము – కలియుగం గూర్చి.

కం॥ కోకల మూకల దిరుగుచు
నే కతమున స్వేదజలము నిలబడనీకన్
యీకలిలో ఫలమబ్బును?
లోకపు కోలాహలమ్ము రూఢిగనిదియే!!

12. జి.కె. సుబ్రహ్మణ్యం గారు, విశాఖపట్నం.

ఖేదము,మోదము,వేదము,వాదము–తెలుగుజాతి విభజనానంతరం నవ్యాంధ్ర.

కం॥ ఖేదంబై కొందరకున్
మోదంబిడె విభజనమ్ము ముఖ్యుల కొకటన్
వేదంబన రచియించిరి
వాదంబుల నాయకాళి ఫలమేమగునో?

13. కోడూరు శ్రీలక్ష్మి గారు, విశాఖపట్నం.

రాజసూయం, అశ్వమేధం, పుత్రకామేష్టి, వాజపేయం – భారతార్థం.

తే.గీ॥ పుత్ర! కామేష్టి వీడుమా! పోరులేల?
రాజసూయమ్ము మనధర్మరాజుచేయ!
నశ్వమేధంబు నందశ్వమౌదువేమొ?
హేయమై చన నీవాజి! పేయమగునె?

14. కె. కళ్యాణభారతి గారు, విశాఖపట్నం.

అఘోర, రుద్ర, ఆనంద, భైరవ – విష్ణుస్తవం.

సీ॥ ఆనందభైరవిన్ హాయిగా పాడుదున్
హరి! నన్ను గాచునటంచు సతము,
నీవ రుద్రసఖుడ వీవధానమ్మునన్
ధైర్యమ్ము గూర్పుమా ధారనిచ్చి,
'భైరవము'లనెల్ల బాపుమా కేశవా
కోటిరాగమ్ములకొల్తునిన్ను,
కొండలరాయడ! ఘోరమ్ములవియేల
నుగ్రవాదము పేర నుర్వినిపుడు,

* **భైరవము** = భయానక రసం.

తే.గీ॥ అన్నమయవోలె నిన్నునేనాశ్రయించి
విన్నపమ్ములు చేసెద వినుమదేవ!
తిరుమలేశ్వర! శ్రీశ! నుతింతు నిన్ను!
దత్తపదియందు పృచ్ఛక చిత్తమలర!!

15. కన్నేపల్లి వరలక్ష్మిగారు, విశాఖపట్నం.

సార, పార, తీర, దార – రామాయణార్థం.

ఉ॥ సారమతీంద్రుడౌ హనుమ సాగరలంఘనముంబొనర్చి సొం
పారగ వాయుమార్గమున, మారుతి లంకనుజేరె; సీతకున్
తీరని దు:ఖముంబొదవె దివ్యుని రామునిదూత జూడ, నా
ధారముగా నొసంగిన దుదారత నా 'మణి' స్వామికందగన్.

16. కె. నర్సింగరావు గారు, అనకాపల్లి.

శక్తి, యుక్తి, రక్తి, ముక్తి – భారతార్థం.

ఆ.వె॥ శక్తికొలది బండి చక్రమ్ము రక్షగా
యుక్తి పోరు సలిపె యువశరమ్ము
అగును జయమటంచు నభిమన్యుడనురక్తి
ముక్తి నొంది స్వర్గమునకు జనియె.

17. శేఖరమంత్రి ప్రభాకరరావు గారు, విశాఖపట్నం.

కళాభారతి,ప్రసన్నభారతి,పద్యహారతి,విజయసారథి- శతావధానవైభవం.

తే.గీ॥ ఈ 'కళాభారతిన్' పద్యమే తపస్సు
మాకిట 'ప్రసన్నభారతి' మార్గమయ్యె
పద్యహారతిబట్టగ పండితాళి
విజయసారథినయ్యెద వినయమొప్ప!!

18. మంగు శివరామప్రసాద్ గారు, విశాఖపట్నం.

పొత్తులు, ఎత్తులు, కత్తులు, చిత్తులు - రాజకీయపు క్రొత్తకాపురం.

కం॥ పొత్తులుకుదిరిన పక్షము
కత్తులుకా కుండు శాంతి కలకాలముగా
ఎత్తులు పైయెత్తులతో
చిత్తగు మనరాష్ట్రభవిత చెప్పగ సిగ్గౌ!!

19. భాగవతుల కృష్ణారావు గారు, విశాఖపట్నం.

శవము, పాడె, కాడు, చితి - జన్మదినోత్సవాల పరంపర.

కం॥ శైశవము ముద్దులొల్కను
ఆశలతోపాడెనెన్నొ హరిగీతములన్
ఆశయముల కాడుట, యా
వేశంబును మరచి తినెడు విధియే మేలౌ!!

20. బులుసు సరోజినీదేవి గారు, విశాఖపట్నం.

పాలు, పెరుగు, వెన్న, నేయి - ఇప్పటి మధ్యతరగతి ప్రజల కష్టాలు.

తే.గీ॥ చెప్పగానెన్నిశాపాలు జీవనమున
పెరుగుదల లేని జీతాల నరసినంత
వారి కష్టాలుపో వెన్నడేని జూడ
ఇకప్రభుత్వము తీర్చునే యిక్కటులను!!

21. 'కవిగాండీవి' ఎ.పి.వి. ప్రసాద్ గారు, విశాఖపట్నం.

అత్త, పొత్తు, క్రొత్త, ఒత్తు - ఇష్టదైవస్తుతి.

కం॥ అత్తరి నిత్తరి ననకయె
పొత్తున నాకందజేయు పొల్పుగ జయముల్
క్రొత్తగు వేలుపులేలన్
చిత్తము తళుకొత్తు నతులుజేసెద శ్రీశా!!

22. రాంభట్ల బాలకృష్ణ శర్మగారు, విశాఖపట్నం.

వెన్న, చిన్న, కన్న,మిన్న - బాల్యవర్ణన.

తే.గీ॥ చిన్ననాటి గురుతులు లేవెన్ననేడు
కన్నవారల ప్రేమను కన్నస్మృతులు
మిన్నయౌనవి తలచినమేలనంగ
చిన్నతనమదె మధురమౌ నెన్నియున్న!!

23. కారె అనూరాధ గారు, విశాఖపట్నం.

కట్టె, కొట్టె, పట్టె, తెచ్చె – రాజకీయనాయకుల వైఖరి.

తే.గీ॥ "కట్టెనై కాలెదన్ మాటనిట్టెనిలుప
నొట్టునిజమని" బల్లను కొట్టెనొకడు
పట్టెడన్నము బెట్టడు! పరుడతండు!
తెచ్చె జాతికి చేటును మచ్చయనగ!!

24. గుత్తి పుష్పలత గారు, విశాఖపట్నం.

వసిష్ఠ, విశ్వామిత్ర, భరద్వాజ, భృగు – రామాయణార్థం.

తే.గీ॥ ఆ వసిష్ఠుని యాశీస్సులందికదలె
యాగమునకు విశ్వామిత్రుడేగుచుండ
భృగు కులజుడట్లు కోపింప తగను మ్రొక్కి
వనమునందు భరద్వాజమునిని కాంచె

25. ఆదూరి విద్యావతి గారు, విశాఖపట్నం.

కట్టు, బొట్టు, జుట్టు, పట్టు – ఆధునిక మహిళ.

తే.గీ॥ కట్టు విజ్ఞానవారధి క్రమమెసంగ
ముగ్ధనాడు, తా జుట్టును పుడమినేడు
పట్టువిడువక లక్ష్యంపు పథమునందు
చివరి రక్తపుబొట్టైన చిందు మహిళ!!

ఇలువేలుపు శ్రీశ్రీశ్రీ వెంకమ్మ పేరంటాలు, శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆశీస్సులతో...

'ప్రసన్నభారతి' సాహిత్య పత్రిక నిర్వహించిన

"సంపూర్ణ శతావధానము"

అవధాని : 'అవధాన సుధాకర' శ్రీ రాంభట్ల పార్వతీశ్వర శర్మ

18, 19, 20 – నవంబరు, 2015.
కళాభారతి ఆడిటోరియం, మద్దిలపాలెం, విశాఖపట్నం.

వర్ణనలు:

1. టి.వి.ఎల్. నర్సింగరావు గారు, శ్రీకాకుళం.

రైతుల ఆత్మహత్యలు, ప్రభుత్వబాధ్యత.

కం॥ మద్దతు ధరనీయన్ వలె
నొద్దికగా 'ఋణముమాఫి' యొనరింపంగా
నద్దైవంబగు ప్రభుతయు –
ముద్దుగ తగ నుద్ధరింప మొర విని రైతున్.

2. పూడిపెద్ది కృష్ణకిరణ్ గారు, విశాఖపట్నం.

సంధ్యాసమయంలో శివాలాస్యం.

ఆ.వె॥ పదముపదము కలియ వరమగు లాస్యమ్ము
పరమశివుని పదము! పరమపథము!
పరవశించియాడ పార్వతీశ్వరులటన్
పచ్చదనము జగతి పరిఢవిల్లు!!

3. పిళ్ళా వేంకట కనక మహాలక్ష్మి గారు, విశాఖపట్నం.

ఆధునికపంచభూతాలయిన సెల్లు, లాప్ టాప్, టాబ్, ఫేస్‌బుక్,వాట్సాప్ లాంటివి లేకపోతే యువత మానసిక స్థితి.

కం॥ బద్ధకమన్నది చేరదు
సద్ధర్మము తెలియవచ్చు, సంస్కృతి తెలియున్
పద్ధతులవి మారినచో
నిద్ధరణిన్ యువత మేలు నెంతయు పొందున్.

4. నూకల మణి గారు, విశాఖపట్నం

శతావధానంలో అవధాని మనోభావన.

పంచచామరం:

పదమ్ము బట్ట, భావముంచ, పాదమున్ తరింపగా
హృదిన్ విశాల పద్య 'పార్వతీశ్వరా'! నుతించెదన్!
వదాన్యసద్గురూత్తముల్ శివమ్ము శంకరమ్ముగా
సదా ననున్ కనంగచాలు సజ్జయంబు నొందెదన్

5. బి.వి. బంగార్రాజు గారు, విశాఖపట్నం.

రచయిత గుడిపాటి వెంకటాచలం దృష్టిలో – సీతను అగ్నిప్రవేశం చేయమన్న రాముడి గూర్చి.

సుగంధి: ఎక్కువేది తక్కువేది యేది ధర్మమయ్యె? తా
నిక్కటుల్ భరింపగా మహీజ సీతకక్కటా!
ధిక్కరించె రామచంద్ర ధీమణిన్ "చలం"బహో
వెక్కిరింతయో? నిజమ్మొ? విజ్ఞులే తలంత్రులే!!

6. కందాళ కనకమహాలక్ష్మి గారు, విశాఖపట్నం.

కొండేపూడి సుబ్బారావు గారి ఆశయాల్ని పంచుకున్న - వారి పుత్రుడు కొండేపూడి ప్రసాద్ గారు, "ప్రసన్నభారతి" సాహిత్యపత్రికను నడిపిస్తున్న తీరును చూస్తే ఆ సుబ్బారావుగారికి కలిగే పుత్రోత్సాహం.

మంగళమహాశ్రీ:

వృద్ధుడయి వచ్చితిని వేయిపనులున్నయవి వెల్గగనుచేయుటను కంటిన్
బద్ధతను వీడకయె భవ్యమగుకార్యముల పద్ధతిగ చేయుటను కంటిన్
శుద్ధతనుపత్రికయు సూటిగను సాగగను 'సూరి'యననుంటివని వింటిన్;
ఇద్ధరణినెవ్వరొకొ యిట్లు కృషిసల్పెదరు హేలను 'ప్రసాదు'డవు పుత్రా!!

7. ఉండవల్లి సుజాతామూర్తిగారు, విశాఖపట్నం.

ఎండలైతే ఎండలని వానలైతే వానలని బాధపడే మానవుల స్వభావం.

వసంతతిలకం:

ఘోరాతపమ్మున ప్రకోపిగ సూర్యుడుండన్
నీరమ్ము నిండి యవనీతలమెల్ల పండున్
కారమ్ము, తీపి, మమకారములేలనమ్మా
సారమ్మునెంచిన ప్రశాంతత చాల గల్గున్!!

8. లలితావాసిష్ఠ గారు, విశాఖపట్నం.

విజయనగరంజిల్లా పరిసరాల్లో కురిసిన మత్స్యవర్షం గూర్చి.

స్రగ్విణి: ఏ సముద్రమ్మునం దెచ్చటో మత్స్యముల్
వాసముంజేయగా, వర్షమీరీతిగా
పోసెనే ధారగా పొల్పుగా బీదకై
ఆసలానందమై అంబరంబంటగా!!

9. కె.ఎస్.వి. రమణమ్మ గారు, విశాఖపట్నం.

రామాజ్ఞగా లక్ష్మణుడు సీతను అడవుల్లో విడిచిపెట్టడానికి వెళుతున్నపుడు, ఆ విషయం మార్గమధ్యంలోనే సీతకు తెలిస్తే ఎలా ఉంటుంది. (కల్పన)

కం॥ వాగులు కన్నీరై చను,
నా గమనము చేయురథము నా క్షణమాగున్
వేగమునొందును హృద్ధ్వని
వేగదె యా 'సీత' అకట విరహవ్యథతో!!

10. డా. ఎల్. ఎస్. యాజ్ఞవల్క్యశర్మ గారు, పాయకరావు పేట.
ప్రసన్నభారతి పత్రిక ఔన్నత్యాన్ని వర్ణించాలి.

తే.గీ॥ మూడునెలలకునొకతరి మోదమిచ్చు
సాంద్ర సాహిత్యపత్రిక! సత్యమయ్య!!
చూడగ ప్రసన్నభారతిన్ చోద్యమయ్యె
నింతకీర్తిని గనెనెద్ది? యీ తరాన!

11. కావలిపాటి నారాయణరావు గారు, విశాఖపట్నం.
తిరుమల గిరుల వర్ణన.

వనమయూరం:
అన్నమయ రాగముల కందమిడెకొండల్;
అన్నమయకోశముల కాదరువు కొండల్;
ఎన్నగను భక్తులకు హేమములు కొండల్;
నన్నుగని కాచుటకు నాణెమగు కొండల్!!

12. ఆదూరి విద్యావతి గారు, విశాఖపట్నం.

'హుద్ హుద్' తుఫాన్ తర్వాత కోలుకున్న విశాఖనగరం.

తరలం: వెలిగె దీపము జీవముంగొని వెండి కాంతుల నీ క్రియన్
కలిగె నీశుని సత్కృపానిధి కార్యరూపము దాల్చెగా
చెలగుమాయల చెల్లజేయుచు చీకటుల్ విడిపోవగా
నలరెనయ్య విశాఖ యీవిధి నందమే చిగురింపగన్.

13. చర్ల మృదుల గారు, నిడదవోలు.

వృద్ధాశ్రమాల నిర్మూలనలో యువతపాత్ర.

ఉత్సాహ: 'కడుపుకోత' సంతతయ్యె కడుపుకోత వెట్టగా
నడచుటెట్లు సత్పథాన నమ్మియువత బెద్దకున్?
దడను కల్గజేయుచుండె; ధర్మమొప్పగాంచుడీ
నడక నేర్పినట్టివాని న్యాయమనగ సాకుడీ!!

14. కడిమిళ్ళ శ్రీవిరించి గారు, నరసాపురం.

అవధానం పట్ల యువత ఆకర్షితులవ్వాలంటే.

ఆ.వె॥ పాఠశాలనుండి పద్యమ్ము పఠియింప
నేర్పవలయి, చెప్పనోర్పువలయు!
నీతులందుకాక చేతలన్ చూపింప
నీ వధానముండు నేండ్లు నేండ్లు!!

15. డా. పి. రామచంద్రరావు గారు, కొవ్వూరు.

'కవిశేఖర' కొండేపూడి సుబ్బారావుగారి సాహితీ విరాట్స్వరూపం.

ఉ॥ ఆశువుగాగపద్యముల నా శివు సత్కృప జెప్పి యుండె, యా
వేశకవిత్వమై యమరె, విందును జేసెను కావ్యరాశితో
లేశము నేన్ శ్రమంబుకనరే! కవితన్ తనరంగజేయ! నా
కాశమె హద్దనంగ నిజ కావ్యములన్ మహి నిల్పి నారుగా!!

16. కొప్పిశెట్టి సూర్యనారాయణ గారు, ఎలమంచిలి.

త్రేతాయుగ, ద్వాపరయుగాలను చూసిన ఆంజనేయుని మనోభావన.

ఆ.వె॥ తారుమారుగాగ ధర్మంబు యుగముల
యోగముద్రనొక విరాగియనగ
తా చలింపకుండు దైవమే కర్తనఁ
జూచుచుండు! మనల బ్రోచుచుండు!!

17. అవుగాడ అప్పలనాయుడు గారు, అనకాపల్లి.

తిరస్కరించిన ప్రేయసిని ప్రసన్నం చేసుకోవాలంటే.

తే.గీ॥ కినుక తీర్పక తప్పదు కృష్ణుడేని!
యడిగినట్టిది స్వర్ద్రుమమైనగాని!
ఇంతులకు కోర్కులను తీర్పనినుమడించు
యశము, శుభమును, సుఖమును! హాయి నిచ్చు!!

18. డా. కోలవెన్ను పాండురంగ విఠల మూర్తిగారు, విశాఖపట్నం.

విశాఖలో అభివృద్ధి చెందుతున్న శాస్త్ర, సంగీత, సాహిత్యాలు.

మత్తకోకిల: ఎన్నగా కళలెన్నొ తీరిన వీవిశాఖను చెన్నుగా
మన్ననన్ గొన శాస్త్ర పాండితి మాన్యమై విలసిల్లెడిన్
దన్నుగా మన 'సామవేదము' తన్మయత్వము కూర్చగా
పెన్నిధానమె యీ వధానము పేటపేటలు చాటగా!!

19. శేఖరమంత్రి ప్రభాకరరావు గారు, విశాఖపట్నం.

సింహాద్రి అప్పన్న నిజరూప దర్శనం.

చం॥ కనగను చందనోత్సవము కన్నులపండుగ ! సింహశైల పా
వనశుభ దర్శనమ్ము నిజ భక్తులకిచ్చును పుణ్యరాసులన్
దినదినమున్ స్మరించెదము దివ్యుని నామము మానసంబునన్
మనగనుజేయుమయ్య మము మాన్యులజేయుమ శ్రీనృసింహమా!

20. పేరాల హరిప్రియ గారు, విశాఖపట్నం.

కార్తికమాసం, శరదృతువుల సమన్వయం.

శా॥ దీపజ్వాలలు పౌర్ణమిందెలుపు; వందేయంచు భక్తాళి యే
రూపంబందుననిన్ను గొల్చినను సారూప్యంబు బోధించెడిన్;
నీపాదంబుల కార్తికమ్మున శివా! నిత్యమ్ము ధ్యానించెదన్
ప్రాపైకావుమ నన్ను సంతతము నే పారంగ నా జ్ఞానమే!

21. ద్విభాష్యం వేంకటేశ్వర్లు గారు, హైదరాబాద్.

పూర్వవైద్యులకు, ఇప్పటి వైద్యులకు భేదసామీప్యాలు.

ఆ.వె॥ బ్రతుకు తెరువుకొరకు బాధను తీర్పంగ
కొలువు జేయుచుండు క్రొత్తయేమి?
వైద్యుడన్నదేవవైద్యుడే యానాడు
వర్తకంబనంగ వరలెనేడు!!

22. కొండేపూడి సర్వేశ్వరప్రసాద్ గారు, విశాఖపట్నం.

కర్ణపిశాచి అయిన "సెల్" గూర్చి.

సుగంధి: రింగురింగులన్నిపోయి రింగు గీతమయ్యెగా
ముంగియౌట కద్దుగాని మ్రోగుటే పసందురా
నింగినంటుదాని ఖ్యాతి నిత్య మస్థిరమ్ముగా
మంగళమ్ములందుకొమ్ము మాన్యదూరవాణిగా!!

23. కె. కళ్యాణభారతి గారు, విశాఖపట్నం.

ద్వాపరయుగంనాటి యాదవులు - నేటి ఉగ్రవాదులు.

తే.గీ॥ ముసలములవేల? చాలదా మోసమిపుడు!
శాపములునయ్యె రెండు దేశమునజూడ
ఆయుధంబది యేదియు నైనగాని
అంతమొందింప సృష్టిని అకట తగునె!!

24. భాగవతుల వసుధ గారు, పెద్దాపురం.

విద్యుద్దీపకాంతులలో విశాఖ సాగరతీరం.

ఆ.వె.॥వెన్నెలనగ విరియు వ్రేలాడుదీపాలు
కనుల నిండు దాని కాంతిరేఖ
సుంత మానసమున చింతలు చెల్లులే
అట్టి అబ్ధితీరమరసినంత!

25. కందాళ నాగలక్ష్మి గారు, శ్రీకాకుళం.

పాఠశాలల్లో ప్రస్తుతం తెలుగు బోధన.

ఉ॥ పొత్తములందునున్నయవి బోధన చేయుటదక్క! యన్యమౌ
ఉత్తమ నీతిపద్యముల నొక్కటి చెప్పరదేమి చిత్రమో!
చిత్తము మెచ్చు కావ్యముల చిక్కని పద్యములేరి యేరియున్
మత్తిల రాగముంగొనుచు మాధురితో తగ పాడ మేలగున్.

-మంగళమ్ మహత్-

ఆశువులు

1. కొండేపూడి సర్వేశ్వర ప్రసాద్ గారు, విశాఖ.

'కవిశేఖర' కొండేపూడి సుబ్బారావుగారి గురించి.

కం॥ కొండేపూడి శుభాన్వయ
పండిత కవిశేఖరుండు వరమైనాకున్
దండిగ నుండగ నండగ
పండదొకో సస్యకవిత పరమాన్నంబై

2. పరవస్తు ఫణిశయన సూరి.

విందుకు ఆహ్వానం.

ఆ.వె.॥ విందులేలమనకు విందయ్యె పద్యముల్
ముందు తినుడు, పిదప మూరుకొనుడు
దినము దినము తినగ మనకద్ది కలదయ్య
క్షణము గడిచినంత కలదె కవిత?

3. ఆదూరి విద్యావతి గారు, విశాఖపట్నం.

కార్తీక దీపకాంతి, కొండేపూడి వారి జయంతిని వర్ణిస్తూ.

కం॥ ఒక్కొక దీపజ్వలనం
బొక్కొక పద్యంబనంగ నొప్పగునయ్యా!
యిక్కాలపుటవధానము
మక్కువనిడు సుబ్బరాయ మనసునకు సదా!

4. డా. కోలవెన్ను మలయవాసిని గారు, విశాఖపట్నం.

'ఫేస్‌బుక్' గూర్చి.

కం॥ ఉదయమున లేచినంతనె
పదిలముగను కరములరయు వారలుగలరే?
కదలక, మెదలక కూర్చొని
పదపడి యా 'గ్రంథముఖి'ని పడిపడి చదువున్

5. రాంభట్ల విశాలస్వాతి, విశాఖపట్నం.

సొమ్ము దాచుకొంటూ... ఉండడం శ్రేష్ఠమా?

ఆ.వె.॥ కూడు గూడ దినక కూడబెట్టుట యేల?
ఉండనింత నేల యొప్పుగాదె?
ఉన్ననాడుగాక నెన్నడు ఫలమబ్బు?
కాన నీ క్షణమ్మె కనుము సుఖము!!

6. పూడిపెద్ది సుధారమణ గారు, విశాఖపట్నం.

ప్రస్తుతం అప్రస్తుతం అవసరమా?

కం॥ ఆలోచనలుం దిరిగెడు
కాలమ్మున వానికిన్ విఘాతముకలుగన్
మేలగు నప్రస్తుతమన;
హేలన్ రంజిల్లజేయు హితముగ సభలన్

7. 'అష్టావధాని' మరుమామిళ్ళ దత్తాత్రేయ శర్మగారు, హైదరాబాద్

మానవత్వ సంబంధ సేతువు నిర్మించాలంటే?

ఆ.వె॥ స్వార్థమొకటి దక్క సార్థకజీవన
సరళి లేదు మనకు శాపమేమొ
'ఆంటి అంకు'లనగ నలవడె జగతికి
అత్తమామలనుట నరయు టెపుడొ?

8. డా. మీగడ రామలింగస్వామి గారు, విశాఖపట్నం.

క్రొత్త ప్రక్రియ అయిన సంగీతనవావధానం గురించి.

కం॥ పద్యముల నన్నయాదుల
హృద్యంబగు భావతతిని యింపుగ గనె, రా
గోద్యమము, మీగడాన్వయ
వేద్యంబు 'నవావధాన' విద్యగదీరెన్!!

9. కొండేపూడి సుబ్బారావుగారి అల్లుడు, విశాఖపట్నం.

విజ్ఞాన శాస్త్రానికి వేదాంతానికి ఉన్న సంబంధం.

ఆ.వె॥ అంతుపట్టనట్టి యంశములఎ గలవయ్య
అందునిందు రెంటనందుకొనగ
బుద్ధికొలది మనకు పొందిక శాస్త్రమ్ము
నుపనిషత్తులైన నుపకరించు!!

10. ఆచార్య సార్వభౌమ వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, విశాఖపట్నం.

శతావధానం చేస్తావా అని అవధానిని మొదట శ్రీ వేదుల దంపతులు అడిగినపుడు, అవధాని అంగీకరించాక శ్రీ వేదుల దంపతుల మనోభావన.

ఆ.వె॥ చేయగలడు వీడు చక్కగా చిక్కగా
పద్యధారకలదు భావమమర
మనుమడైన సభను మన్ననలందును
శారదాంబ ప్రోచి సాకినంత!

11. వల్లభ వఝ్ఝల మూర్తి గారు, విశాఖపట్నం.

స్వాతంత్ర్యం తరువాత – ఇప్పుడు త్యాగమెలా ఉంది?

కం॥ ధనమును, కాలము, నిద్రయు,
తనదైనది పూచికేని తరమే వదలనన్
కననిక్కాలపు స్థితిగతి;
అన నది యిది యనక వీడి రసువుల్ నాడున్!!

12. కె. రాజేశ్వరి గారు, విశాఖపట్నం.

సమాజంలో విభేదాలు లేకుండా విశ్వమానవుని ప్రాదుర్భావం.

ఆ.వె॥ మనుజులైన చాలు మనకేల హంగులు?
భేదమరయుటెల్ల వాదములకు!
సకలజీవరాశి కొకటెగా ప్రాణమ్ము!
ప్రకృతినేర్పుమనకు పాఠములను!!

13. వల్లభవఝ్ఝల శ్రీరామ చంద్రమూర్తి, విశాఖపట్నం.

బలికి శుక్రాచార్యుని బోధ.

కం॥ నేత్రము చెల్లెను నీ రా
జ్య త్రాతగ నుండ నకట! సంకటమ్యెన్;
పాత్రుండైనను దానము
చిత్రంబగు వటునకీయ చేటగు నీకున్

14. రాంభట్ల వేంకటరాయ శర్మగారు, విశాఖపట్నం.

అన్నదమ్ముల అనుబంధం.

తే.గీ॥ వలదు వాలిసుగ్రీవుల వైనమెపుడు
రామలక్ష్మణులైన చన ప్రేమమీర
శాంతి సౌఖ్యము దొరలును సంతతమ్ము
నిదియ సోదర మైత్రిగా నెదను దలతు!!

15. తాతా వేంకట లక్ష్మి నరసింగరావు గారు, శ్రీకాకుళం.

జ్యోతిషం, వైద్యశాస్త్రాలను సమన్వయిస్తూ.

కం॥ గ్రహగతినొక్కటి చెప్పును
సహియింపగరాని రుజల శాస్త్రము వైద్యం
బహరహమును బాపునుగా;
మహి రెండును వలయుమనకు మనుగడ సాగన్!!

16. కందాళ నాగలక్ష్మి గారు, శ్రీకాకుళం.

అమ్మవారిని స్తుతిస్తూ.

ఆ.వె॥ పదములు చక చక నడవగ
పదరాజ్ఞిని జూచి వరలు పండితులెల్లన్
పదపడి మెచ్చగ లలితా
సదతీ! మముగాచు మమ్మ! శోభనమూర్తీ!!

17. డా. రామడుగు వేంకటేశ్వర శర్మగారు, విశాఖపట్నం.

సాహిత్యప్రక్రియల గూర్చి.

ఆ.వె॥ రెక్కలతో రెక్కలుగనె
ఎక్కువ తక్కువలు జెప్ప నెరుగన్ తరమే?
చక్కని పద్యము గలదయ
మక్కువ నే గూర్చి దాని మన్ననగాంతున్!!

Neuro Psycho'logical' basis of Sataavadhanam

Dr. PVSR Bharath Kumar, MPT Neurology,
Chief Physiotherapist,
Sri Sudha Physiotherapy Clinic.
Cell: 9966912389

Sataavadhanam is a versatile art among other telugu literary arts. It is the mastery of a 'Telugu Poet' to face and answer various questions & contexts with 'Poems' in telugu according to the requirements. Though it looks, a 'pure literary process', there are many other domains 'inbuilt' & 'inter-linked' to it. Some of the important domains are, Neurological, Psychological and Logical basis within the 'Art' of Avadhaanam.

As any other intellectual function, Avadhaanam also requires 'Higher mental functions' but at a much 'Intensified' level. There must be a perfect synchronization between left & right halves of the brain. Reticular formation and the Reticular activation system (RAS) which are the basis for the integration various inputs the sense organs are receiving. This system determines the general state of arousal & level of alertness, the key factor which works extensively for 'Avadhaanam'.

The velocity at which the nerve impulses pass, the new connections made between the neurons, extent of neuron pool and past experiences determines the rate of response during avadhaanam. All these factors like receiving the inputs, processing the information and giving the best possible response at high rate and less time lapse exhibits the versatile nature of an Avadhani's brain.

Pre-requisites of Avadhaanam:

1. Practice:

An age old saying that ‘Practice makes one, perfect’. A complex literary process like avadhaanam requires huge amount of practice and various innovative and self-tailored methods for it.

2. Language Skills:

Language looks like mere mode of communication for majority of the people. But for the people who work extensively in the literary field, it is a ‘Science’. They need to explore various dimensions of the language and also experiment with it in much ethical form. Avadhaanam demands an avadhaani’s relative ‘supremacy’ in the language.

The processing of this language in human brain is done by two major centers, Wernicke’s area & Broca’s area. Former is vital in receiving and processing the inputs while later is responsible to articulate the speech.

3. Perception:

Perception is not just the things world shows us, but how we take them. Avadhaani is subjected to various different and complex contexts and tasks during avadhaanam. It is the key element how avadhaani perceives various tasks than exactly how they are given.

4. Thinking:

Thinking is a very complex, very quick and rapid spontaneous process. It is unique from one individual to other and varies with time in same individual. Avadhaani undergoes enormous thinking process. In addition to generalized thinking, he needs to think ‘iaterally’ and ‘out of the box’.

5. Problem Solving:

This is the key element of any task, especially Avadhaanam. Avadhaani has to solve various riddles, answer different questions

in varied contexts. All this process is a higher grade 'Problem solving' and Avadhaani must be mastered in it.

6. Memory:

Human brain stores an enormous amount of information throughout the life. Whenever an individual makes a best possible response, besides all other knowledge and various other factors, his past experiences plays a vital role. All these are the readily available 'stored' information. Avadhaanam requires swift response and avadhani's memory is key to that. He makes use of all sorts of memory like Long-term, short-term, implicit and explicit etc.

7. Intelligence:

Intelligence is a combined process of various cognitive functions like thinking, ideas, creativity etc. it varies from one to other. Avadhaani's intelligence along with the other factors determines his success.

8. Attention:

This is the 'Heart and Soul' of Avadhaanam in particular. Attention which is said to be in two different forms, Sustained attention & divided attention. Sustained. Avadhaanam is the best example for the 'Divided attention'. Attention depends on many factors like spontaneity, satisfaction and sustainability. If we can closely observe the Attention phenomenon and Avadhaanam, we can draw a conclusion that the entire framework of Avadhaanam is formulated in accordance with the psychological aspects of Attention.

Thus, Avadhaanam is a process which requires good language skills, high intellectual skills, Logic and reasoning, which all are the part and parcel of Neuro-Psychological basis of Human Brain.

* * *

ఆచార్య పొన్నపల్లి వెంకట కృష్ణయ్య
గణితశాస్త్ర విశ్రాంతాచార్యులు
ఆంధ్రవిశ్వకళాపరిషత్, విశాఖపట్నం.
సెల్ : 8897638898

ప్రశంస

కం॥ శతపద్యకుసుమములతో
శతావధానార్చనమ్ము శారదకున్ జే
సితివీ మూన్నాళ్ళుగ పా
ర్వతీశశర్మా! బళీ! కవన కుశలమతీ!!

కం॥ వ్రతమునకుద్యాపనముగ
నతివేగంబొప్ప పద్దియంబుల వినిపిం
చితివీ ధారణ గని – భా
రతి నీకు నొసంగుతన్ వర ఫల సమూహాల్!!

(శతావధాన విజయోత్సవ సభలో సమర్పితం)

రాంభట్ల వేంకటరాయశర్మ

ఎమ్.ఏ. తెలుగు, ఎమ్.ఏ. జ్యోతిషం, ఎమ్.ఎస్.సి. మైక్రోబయాలజీ.

యు.జి.సి. జె.ఆర్.ఎఫ్. పరిశోధకవిద్యార్థి,

తెలుగుశాఖ, ఆంధ్రవిశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

సెల్: 99852 43171.

అంతరంగం

(తమ్మునికాశీర్వచనం)

స్ఫురణ, ధార, వ్యుత్పత్తి ఉండి.. అన్వయ సౌష్టవంతో చెప్పిన పద్యం శాశ్వతంగా నిలుస్తుందని మా పితామహులు శ్రీ పార్వతీశ్వరశర్మగారు ఎప్పుడూ చెబుతుండే వారు. వీటికి ఉదాహరణలుగా నన్నయగారి నుండి మొదలు పెట్టి సందర్భోచితంగా అందరి పద్యాలను వినిపిస్తుండేవారు. తాతగారి పద్యరచనల్లో కూడా ఈ తరహా లక్ష్యాలు మెండు. వారు నమ్మిన ఏ సిద్ధాంతమైనా ముందు స్వయంగా ఆచరించి, తర్వాత ఎదుటివారికి చెప్పేవారు. అందుకే వారు రాసిన పద్యాలు హాయిగా సాగిపోయేవి. ఏ సమస్యాపూరణమైనా, దత్తపది పూరణమైనా, వర్ణననైనా సమయోచితంగా, భావ గాంభీర్యంతో, అర్థానుగతంగా ఉండాలని తపన పడేవారు. మా తాతగారు చెప్పిన సూత్రాలను అక్షరాల ఆచరించి శతావధానంలో విజయకేతనం ఎగరేసిన మాతమ్ముడు చి॥ పార్వతీశ్వర శర్మకు అభినందనలు.

6వ తరగతి చదువుతున్నప్పుడు 'అమ్మ' కవితతో గళం విప్పిన తమ్ముణ్ణి, నన్నూ ఒడి చేర్చుకుని, బడి చదువులతోపాటు పద్యరచన పట్ల కూడా ఆసక్తిని పెంచిన ఘనత మా తాతగారు శ్రీ పార్వతీశ్వరశర్మ గారిదే. దీనికి మా తల్లిదండ్రులు సూర్యకాంతకామేశ్వరి, స్వర్గీయ లక్ష్మీనరసింహసోమయాజులు గార్ల ప్రోత్సాహం తోడయింది. సమస్యలు, దత్తపదులను పూరించడం అభ్యాసం చేయడంతో తమ్ముడి పద్యరచనాప్రస్థానం మొదలైంది. 16వ యేట అష్టావధానం చేస్తాననడంతో, తమ్ముడి జిజ్ఞాసను గుర్తించి, కుటుంబ సభ్యుల సహకారంతో శృంగవరపుకోటలో తొలి అష్టావధానం చేయించడంలో మా తాతగారి పాత్ర కీలకం. అలా అవధానానికి బీజంపడి ఇప్పటివరకూ 36 అవధానాలు చేసి 'రాంభట్ల' నందనారామంలో చిన్న మొక్కలా ఎదుగుతున్నాడు మా తమ్ముడు.

ఇలా ఉండగా, 'ప్రసన్నభారతి' సంస్థవారు "శతావధానం" చేయమని అడిగారని మా తమ్ముడు నాతో చెప్పగానే ముందు సంతోషించినా, తర్వాత ఆలోచించాను. ఎప్పటికప్పుడు తగిన సూచనలిస్తూ మమ్మల్ని నడిపించే తాతగారు స్వర్గస్తులయ్యాక, శతావధానం చెయ్యడం కొంచెం కష్టమే అనుకున్నాను. సంస్కృతం, తెలుగు భాషాసాహిత్యాల్లో ఏ సందేహమున్నా అడగ్గానే వివరించే, మాతామహి రాంభట్ల సత్యవతమ్మ కూడా ఎవరో పిల్చినట్లు హడావుడిగా స్వర్గస్తురాలవటంతో, ఏం చెయ్యాలోనని ఆలోచించాను.

ఈ ఒత్తిడి నుండి తమ్ముణ్ణి బయటికి రప్పించడానికి రోజూ ఐదు సమస్యలు, ఐదు దత్తపదులను ఇచ్చి పూరించమనేవాడ్ని. అందరి కన్నా మా తమ్ముణ్ణి ఇలా సమస్యల్లోకి నెట్టిన వాడ్ని నేనేనేమో..! మా అమ్మ 'సూర్యకాంత కామేశ్వరి' ప్రోత్సాహం మాకెంతో ఉత్తేజాన్నిచ్చింది. దీనికి తోడు కుటుంబ సభ్యులందించిన సహకారం, పెద్దల ఆశీర్వచనబలంతో... సాధన చేసి, శతావధానం నిర్విఘ్నంగా పూర్తిజేయ గలిగాడు. శతావధానంలో పద్యాలు హృద్యంగా వచ్చాయి. ఇంకా ఇది మొదటి శతావధానమే. ఇలాంటి అవధానాలు చాలా చేయాలని నాన్నగారి, తాతగారి ఆశీర్వచనాలు ఈ చిరంజీవికి ఉండాలని ఆకాంక్ష. అష్టావధానిగా ఉన్న ఈ చిన్న మొక్కకు సారవంతమయినవన్నీ సమకూర్చి శతావధానవృక్షంగా ఎదగడంలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు. అందరూ చేసేది ఈశ్వరార్చన అయితే నేను, మాతమ్ముడు చేసేది మాత్రం "పార్వతీశ్వరార్చన". అందరి ఆశీస్సులు తమ్ముడి మీద ఇలాగే ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటూ...

పంచచామరం : **శతావధానవిద్యయందు చక్కగాను మేటివై**
హితమ్ముగోరువారికెల్ల నిందుమౌళిసామ్యతన్
వ్రతమ్ము బూను పార్వతీశ - వాణి దివ్యపాదముల్
సతమ్ము చేరి కొల్చి సాంద్ర సాహితిన్ వెలుంగుమా!!

రాంభట్ల వేంకటరాయ శర్మ
05 - 02 - 2016

'అవధానసుధాకర' 'అవధాన భారతి' 'అవధానభీమ'

రాంభట్ల పార్వతీశ్వర శర్మ

సీనియర్ రీసెర్చ్ ఫెలో (Ph.D.), తెలుగుశాఖ,
ఆంధ్రవిశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

జన్మస్థలం : శ్రీకాకుళం. పుట్టినతేది : 09 - 12 - 1988.
(విభవనామ మార్గశిర శుద్ధ పాడ్యమి)

జననీజనకులు : సూర్యకాంతకామేశ్వరి, కీ.శే. లక్ష్మీనరసింహసోమయాజులు

ధర్మపత్ని : చి. సౌ. విశాలస్వాతి, ఎం.బి.ఏ., బి.ఇ.డి.,

కుమారుడు : ఆర్. వి. ఆర్. ఎస్. క్షేమేంద్ర సుహాసనందన్

అత్తమామలు : చామర్తి ఉమాకుమారి, విశ్వనాథం దంపతులు

అవధానగురువు : కీ.శే. రాంభట్ల పార్వతీశ్వరశర్మ గారు (పితామహులు)

విద్యార్హతలు : ఎం. ఏ. తెలుగు., ఎం.ఏ. సంస్కృతం.,
యు.జి.సి. - నెట్., ఎ.పి. - సెట్., (తెలుగు)

అవధానరంగం : ఒక శతావధానం, ఒక ద్విగుణిత అష్టావధానం,
37 అష్టావధానాలు.

ముద్రితగ్రంథాలు: శ్రీ రాంభట్ల వేంకటీయం, మొదటిమొగ్గలు, ప్రతిభాస్వరాలు.

అభిరుచులు : సాహితీరూపకాల్లో పాత్రధారణ, రేడియో ప్రసంగాలు,
సభావ్యాఖ్యానాలు, పత్రికారచన, ఆశుకవితాప్రదర్శనలు.

బోధనానుభవం : సివిల్ సర్వీసెస్ అభ్యర్థులకు తెలుగు భాషాసాహిత్యాలు,
డిగ్రీ, పి.జి. విద్యార్థులకు, డి.ఎస్సీ, టెట్, మొదలైన పోటీ
పరీక్షల అభ్యర్థులకు తెలుగు పాఠ్యాంశాల బోధన.

చిరునామా : ఫ్లాట్ నెం. 402, సాయిబాలాజీ హోమ్స్, సత్యానగర్,
చినముషిడివాడ, విశాఖపట్నం - 530051.
సెల్ : 9247 859580.
E-mail: rpsarma9247@gmail.com
Website : www.rambhatla.in

‘అవధాన సుధాకరు’డవు
వివిధప్రజ్ఞావిశేష విద్యామతివై
‘అవధానభారతీ’ కృప
నవరసభావార్ద్ర కావ్యనవ్యత గనుమా!

- డా. మాడుగుల నాగఫణిశర్మ

పద్యారంభములందు నెత్తుగడ
నుద్భాసించు అందాలు, రం
గద్యుక్తిన్ సుమనోహరంబయిన
ముక్తాయింపులెన్నన్ భళీ!
హృద్యంబౌ అవధానవిద్య
పదిలంబెంతేని నీబుద్ధి, వి
ద్వద్యోధాగ్రణి! పార్వతీశ్వర కవీంద్రా!
నిన్ ప్రశంసించెదన్!!

- డా. మేడసాని మోహన్

ప్రాణము పోయగా పరమ
పావనమైన వధాన విద్యకున్
ధ్యానము చేసి పద్యముల
ధారణజేసి శతావధానివై
రాణ తనర్చితంటి! యిదెరా
యవధానమనంగ, తెన్గు మా
గాణము నేలగా తగు వికాసము
నందుమ! పార్వతీశ్వరా!

- డా. గరికిపాటి నరసింహారావు